# భజగోవిందం

ఆది శంకరాచార్యులు వారు భజగోవిందం రచించిరి. ఇందులో 31 శ్లోకములు కలవు. ఒక పేద బ్రాహ్మణుడు ఇంటి ముందు కూర్చుని వ్యాకరణ సూత్రములు వల్లే వేయుట చూచి " భజగోవిందము"ను ఆశువుగా చెప్పిరి.

ఓమూఢమతీ! గోవిందుని స్మరించుము. మృత్యువు ఆసన్నమైనప్పుడు నిన్ను రక్షించినది గోవింద నామం ఒకటే కానీ, ఈ వ్యాకరణము కాపాడ జాలదు" అని దీని అర్థం.

- మొదటి పన్నెండు శ్లోకములు శంకరులవారు చెప్పిరి. దీనిని "ద్వాదశ మంజరికా" అందురు.
- వారి ఫణతి నందుకుని, వారి శిష్యులు పదునాలుగు శ్లోకములు చెప్పిరి.

- శంకరాచార్యుల వారు చివరిలో ఐదు శ్లోకములు ఆశీర్వాద పూర్వకముగా చెప్పిరి.
- భజగోవిందములో మొత్తం 31 శ్లోకములు కలవు.

భజగోవిందం యొక్క ముఖ్య ఉద్దేశం వర్ణాశ్రమ ధర్మాలను సరియైన పద్ధతిలో పాటిస్తూ, ఆ ఆచరణలో వచ్చే ఇబ్బందులను ఎలా తొలగించుకోవాలో తెలియజేసే మార్గాన్ని చూపుట.

ఇది వైరాగ్య ప్రధానమైన అంశం కనుక షుగర్ కోటెడ్ టాబ్లెట్స్ ని రోగికి ఎలా ఇస్తామో, అదేవిధంగా మంచి ఆశయాలతో, భవిష్యత్తు ప్రణాళికలతో ఉన్న పిల్లలకి భజగోవింద సందేశాన్ని అందించాలి. అప్పుడు పిల్లల్లో మానసిక ఎదుగుదల పెంపొందుతుంది.

అప్పుడు వారి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను, తగిన ధైర్యంతో, స్థైర్యంతో ఎదుర్కొంటారు

మానవులు నాలుగు రకముల వారు :

1. ఇంద్రియములకు లోబడిన వారు

2. మనస్సునకు లోబడిన వారు.

3. బుద్ధికి లోబడిన వారు.

4. ఆత్మకు లోబడిన వారు.

ఈ మానవాళి సంస్కరింపబడుటకు చక్కని మార్గమే భజగోవిందం.

అదే విధంగా స్వామి చెప్పిన మార్గం:

S- Spiritual transformation (ఆధ్యాత్మిక సంస్కరణ) Service

A-Asociation transformation (సామాజిక సంస్కరణ) Adoration

I- Individual transformation (వ్యక్తిగత సంస్కరణ) Illumination.

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు 1973 వ సంవత్సరం వేసవి తరగతులలో

"భజగోవిందము"ను ప్రధాన అంశంగా తీసుకుని ప్రబోధించిరి. సంస్కృత

శ్లోకములకు "హరిగోవిందం" అను చక్కని తెలుగు పద్యములను వివరించిరి .

"మానవుడు తన ముందుగతి మాట మరచి మోహ పరవశుడై ద్రవ్యము, పదవి, వాహనము, శరీర బలము, పశుగణము, దివ్య భవనములు, దీర్ఘాయువు మొదలగు ఐహిక సుఖములకు సంబంధించిన విషయములు యేవి కలవో వాటి యొక్క అశాశ్వత స్థితిగతులను గురించి తన జీవితమంతా ధారపోయుచున్నారే కానీ తన శాశ్వత సుఖముల గూర్చి క్షణ మాత్రం కూడా ఆలోచించటం లేదు. ఎంత కష్టము" —బాబా

## ❖ శంకరాచార్యుల వారి జీవిత చరిత్ర

సనాతన ధర్మము క్షీణించి, నాస్తికత్వం బాగా పెరిగినటువంటి పరిస్థితులలో 8వ శతాబ్దం చివర శంకరాచార్యులు జన్మించిరి. కేరళ రాష్ట్రంలోని కాలడి అనే గ్రామంలో, నంబూద్రి బ్రాహ్మణ వంశమునకు చెందిన ఆర్యాంబ, శివ గురు దంపతులు ,కుమారుని కొరకై వృషభాచలేశ్వరుని ప్రార్థించగా, శంకరులు

జన్మించిరి. అతి చిన్న వయస్సునసే తండ్రి మరణించినందున, తల్లి ఎంతో ప్రేమతో పెంచెను. చిన్న వయస్సునసే అఖండ ప్రజ్ఞావంతుడై, ఒక మహాపురుషుని లక్షణములు కలిగి ఉండెను. ఐదవయేటనే వేదములను చదివెను. గాయత్రి మంత్రోపదేశం అయిదవ యేటనే జరిగెను. ఒకనాడు శంకరుడు పూర్ణా నదిలో స్నానం చేయుచుండగా తల్లి ఒడ్డున ఏదో పని చేసుకుంటుండెను. ఆ సమయంలో హఠాత్తుగా శంకరుని పాదములను ఒక ముసలి పట్టి నీళ్లలోనికిలాగి వేయగా శంకరుడు “అమ్మా! నన్ను ముసలి పట్టి లాగుచున్నది. నాకు మరణం తథ్యము”అని అరచెను. ఇది చూచి తల్లి ఎంతో భయపడెను. అప్పుడు “అమ్మా! ఈ మరణ కాలమున సన్యసించుటకు అనుమతినిమ్ము. లేకున్న నీ కుమారుడు నీకు దక్కడు” అని ప్రార్థించెను. ఎంతో అయిష్టతతో ఆర్యాంబ కుమారుడు సన్యసించుటకు అనుమతినిచ్చెను.ఆశ్చర్యంగా శంకరుని మొసలి వదిలివేసెను.శంకరుడు

సన్యాసియై దేశ యాత్ర చేయుటకై ఇల్లు వదిలి వెళ్ళెను. ఇల్లు వదలి వెళ్ళుటకు ముందు "తల్లి తనను ఎప్పుడు స్మరించునో అప్పుడు ఆమె సమక్షమునకు రాగలనని"వాగ్దానం చేసెను. తన ఎనిమిదవ ఏట ఇల్లు వదిలెను. సనాతన ధర్మం కొరకు అవతరించిన సదాశివుడే శంకరులవారు.దక్షిణ దేశమంతయు తిరిగి, గురువు కై అన్వేషించుచూ, నర్మదానదీ తీరమున, గోవింద భగవత్పాదాచార్యుల వద్ద శిష్యునిగా చేరి, సకలవేదాంత రహస్యములెల్ల నేర్చుకొనిరి. ఏడేండ్లు వారి శిష్యరికం చేసి, గురువాజ్ఞపై కాశీనగరం చేరిరి. కాశీలోని ఉద్దండ పండితులతో, వాదము చేసి , వారందరినీ ఓడించి అద్వైత వేదాంతం యొక్క ఔన్నత్యమును స్థాపించిరి.

{* ద్వైతము కానిది అద్వైతం. జీవాత్మ పరమాత్మల ఏకత్వ భావన మే అద్వైతం.

"బ్రహ్మసత్యం జగన్మిథ్య జీవో బ్రహ్మైవ నా పరః".బ్రహ్మమే జీవుడు జీవుడే బ్రహ్మము. వేరు కాదు. కంటికి కనిపిస్తున్న జగత్తు అంతా మిథ్య. ఇది ఎలా అంటే? జగత్తులో జీవిస్తున్నంత కాలం దాని ఉనికి అనే భావనకు తగినట్టుగా ప్రవర్తించాలి. ఎప్పుడైతే ఇదంతా మిథ్య అన్న జ్ఞానం గోచరమవుతుందో అందుకు అనుగుణమైన ప్రవర్తన దానంతటదే వస్తుంది". అప్పుడే దేహము దేహి ఒక్కటే అన్న సత్యాన్ని గుర్తించ గలుగుతారు. దీనికి స్వామి ఒక చక్కటి ఉదాహరణ ఇచ్చారు. ఒక గ్లాసులో నీరు ఉంటుంది. ఒక కప్పులో పంచదార ఉంటుంది. (విడివిడిగా) దీనిని ద్వైతము అంటారు. ఆ పంచదారని తీసి గ్లాసు నీటిలో కలిపిన యెడల షుగర్ సిరప్ తయారవుతోంది. ఇది  అద్వైతం అంటారు.

<u>మరొక ఉదాహరణ: </u>అద్దము ఉంటే కదా మనము ప్రతిబింబం చూడగలుగుతున్నాం.

అద్దము లేకపోతే మనము ప్రతిబింబం చూడలేము. .ఆ ప్రతిబింబము, నీవు అనే స్థితి ఉన్నంతవరకు ద్వైతము. కానీ బింట ప్రతిబింబములకు మధ్యలో ఉన్న అద్దమును తీసివేసిన ప్రతిబింబము లేదు అద్దం లేదు. నీవు మాత్రం ఏకమవుతావు. ఇదే అద్వైతము అన్నారు స్వామి*}

అద్వైత సిద్ధాంతమును శాశ్వతముగా చాటుటకు ప్రస్థానత్రయమగు ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు , భగవద్గీతపై భాష్యము వ్రాసిరి. అప్పుడు వేదవ్యాసుడు శంకరులవారికి దర్శనమిచ్చి దిగ్విజయ యాత్ర చేయమని ఆదేశించిరి. ఆ ప్రకారం శంకరుడు దిగ్విజయ యాత్రకై కాశీని వదలి దేశమంతయు తిరిగి, అద్వైత సిద్ధాంతమును శాశ్వతముగా స్థాపించిరి. కుమారిలభట్టు, మండన మిశ్రుడు మొదలగు మహాపండితులను వాదనలో ఓడించిరి. మండన మిశ్రునితో వాదించునప్పుడు, మహా విద్వాంసురాలు అయిన ఆయన భార్య ఉభయభారతిని మధ్యవర్తిగా ఎన్నుకొని వాదన

ప్రారంభించిరి. ఎవరు ఓడెదరో వారు, రెండవ వారికి శిష్యులుగా ఉండవలెనని షరతు పెట్టుకొనిరి. చివరకు మండన మిశ్రుడు ఓడి, శంకరునికి శిష్యుడై సురేశ్వరాచార్యులు అని ప్రఖ్యాతి గాంచిరి. పిదప శంకరుడు ఉభయ భారతిని కూడా శాస్త్ర వాదనతో ఓడించెను. శంకరుడు ఆయన శిష్యులు దేశమంతటా దిగ్విజయయాత్ర కావించిరి.

శంకరుడు తన దిగ్విజయ యాత్రలో కాశ్మీరము చేరి అచ్చట శ్రీనగర్ లో సర్వజ్ఞ పీఠమును అధిష్టించిరి.

అద్వైత సిద్ధాంతమునకు శాశ్వత ప్రాతిపదిక కలిగించుట కై నాలుగు పీఠాలను స్థాపించి, తన ప్రధాన శిష్యులను పీఠాధిపతులుగా చేసిరి. ఆ పీఠములు సుందర హిమాలయ పర్వతాలపై బదరీ, పశ్చిమ సముద్ర తీరాన ద్వారక, తూర్పు తీరాన పూరి, దక్షిణమున శృంగేరి. దేశము నలుమూలలా పీఠములను స్థాపించుట ద్వారా శంకరుడు భారతదేశం యొక్క భౌతిక ఆధ్యాత్మిక

ఏకత్వమును సాధించిరి. ఉపదేశ సహస్రిక, సౌందర్య లహరి, కనకధారాస్తవము, ఆత్మబోధ వీరి రచనలు.

ప్రధాన దైవ క్షేత్రములైన బదరీ నారాయణ, కంచి కామాక్షి, నేపాల్ లోని గృహ్యేశ్వరీ దేవి ఆలయంలో శ్రీ చక్రములను ప్రతిష్టించిరి. ఆయనకు సర్వతంత్ర పరమహంస పరివ్రాజకాచార్య అను బిరుదములు కలవు. భజగోవిందమునకు "మోహముద్గర"అని మరొక పేరు.అనగా మానవుని లోని దివ్యమైన ఆత్మతత్వమును కప్పేసిన మోహమును వీడి నిజ తత్వమును తెలుసుకొని గమ్యస్థానము చేరుట" అని అర్థము. శంకరులవారు తన దిగ్విజయ యాత్ర ముగిసిన తర్వాత, శృంగేరి లో చాలా కాలం గడిపి, తన తల్లి అవసాన దశలో ఉన్నదని తెలుసుకుని, కాలడి వెళ్లి, ఆమెకు మనస్వాస్థ్యమును కలిగించిరి. ఆమె మరణానంతరం వారి గృహము నందే పూర్ణా నది తీరమున ఆమె అంత్యక్రియలు చేసిరి. నేటికీ అది ఒక పవిత్ర యాత్రా స్థలంగా

పరిగణింపబడుచున్నది. శంకరులవారు తన 32 వ యేట కేదార్నాథ్ దర్శించుటకై వెళ్లి, అదృశ్యమై మరి తిరిగి రాలేదు. తర్వాత ఆయన జాడ ఎవరికీ తెలియలేదు. ధర్మో ద్ధరణకై భూలోకమున అవతరించిన పరమశివుడు తన కార్యమును పూర్తిచేసుకుని అవతారమును చాలించెను.

❖ **మూడవ వర్గము భజగోవింద శ్లోకములు -**

1. పునరపి జననం పునరపి మరణం , పునరపి జననీ జఠరే శయనం|
   ఇహ సంసారే బహుదుస్తారే , కృపయాపారే పాహి మురారే||

➢ **హరిగోవిందం -**

- మళ్లీ పుట్టుట మళ్లీ గిట్టుట ,
  అమ్మ కడుపులో అణగియుండుట|
  అంతులేని సంసారము దయతో ,
  దాటింపుము మము దబ్బున దేవా||

**భావము:** పుట్టుట, గిట్టుట ఇది అంతులేని కథ. జనన మరణముల నుండి తరింప సాధ్యము కాని దుఃఖ సాగరం నుండి కాపాడమని మానవులు భగవంతుని ప్రార్థించాలి.

**ముఖ్యాంశములు:**

1. జన్మించిన ప్రతి జీవిక కూడను గతించక తప్పదు. జీవితం అనేది ఈ జనన మరణముల మధ్య చిక్కుకుని ఉంటుంది. ఈ మధ్య కాలమున ఏ రకమైన మార్గము నందు మన మనస్సును ప్రవేశపెట్టి జీవితమును సార్థకం చేసుకుంటున్నాము అనే విషయము విచారించవలసి ఉంటుంది.

2. అనారోగ్యం కలిగినప్పుడు ఔషధం సేవించి వ్యాధి నయం కావాలని కోరుకుంటాము. ఔషధం ఎందుకు సేవిస్తాము ? తిరిగి ఆ వ్యాధి రాకుండా ఉండడానికి, మరలా ఔషధం సేవించే అవసరం లేకుండా ఉండుటకు సేవిస్తాము.

3. అలాగే  జన్మనెత్తటం  ఎందుకనగా, జన్మరాహిత్యము కోసమే.

4. కర్మ మయమైన కాయమే ఈ జన్మకు జన్మరాహిత్యమునకు కారణము.

5. మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" అంటారు. ఈ దేహము బంధనకు ఎంత కారణమో మోక్షమునకు అంతే కారణం. కనుక పవిత్రమైన ఈ దేహమును సార్థకమైన మార్గము నందు ప్రవేశపెట్టి సత్యాన్వేషణ యందు మన జీవితం అంకితం చేసి, నిత్యకృత్య కర్తవ్య కర్మలు ఆచరించుటకు ఈ మానవ జన్మ ప్రాప్తించినది.

6. ఫలితం ఆశించి చేసే కర్మల వలన జన్మ కలుగుతుంది.

నిష్కామ కర్మల వలన జన్మరాహిత్యం కలుగుతుంది.

<u>ఒక చిన్న కథ :</u> ఒక గ్రామంలో ఎంతో గుణవంతుడైన ఒక రైతు ఉండేవాడు. ఒకనాడు  అగస్త్య మహర్షి అతని మీద జాలితో "నాయనా! నిన్ను వైకుంఠానికి తీసుకుని పోతాను, రా" అన్నాడు. అప్పుడు ఆ రైతు " స్వామీ! నా కుమారులు

చిన్నవారు. కనుక ఒక పది సంవత్సరాల తర్వాత వస్తాను." అన్నాడు. పది సంవత్సరముల తర్వాత అగస్త్య మహర్షి అతని దగ్గరికి వచ్చి "నాయనా! నిన్నటితో నీ గడువు తీరిపోయింది. నాతో వైకుంఠానికి రా" అన్నాడు. అప్పుడు అతను "స్వామీ! నా పెద్ద కుమారుడికి వివాహం అయినది. మనవడిని చూసి వస్తాను" అన్నాడు. మళ్లీ పది సంవత్సరముల తర్వాత అగస్త్య మహర్షి వచ్చి ఆ ఇంటి ముందుకు వచ్చి నిలిచాడు. రైతు జాడలేదు. ఇంటి ముందు ఒక కుక్క పడుకుని ఉంది. తన యోగ దృష్టితో ఆ రైతు కుక్కగా పుట్టాడని గ్రహించాడు. కుక్కకు జ్ఞానం ప్రసాదించి "ఇప్పటికైనా నాతో వస్తావా" అని అడిగాడు. అప్పుడు ఆ కుక్క "స్వామీ! రాత్రిపూట దొంగలు వస్తారేమో. నేను  ఇంటికి కాపలా ఉండి, నా పిల్లల, మనుమల డబ్బుని కాపాడాలి కదా. పది సంవత్సరములు అయిన తర్వాత వైకుంఠానికి వస్తాను" అనింది.

మళ్లీ 10 సంవత్సరముల తర్వాత అగస్త్యమహర్షి వచ్చి చూడగా, కుక్క లేదు. ఇల్లంతా మారిపోయింది. యోగ దృష్టితో చూడగా ఆ కుక్క ఇంటి వెనక ఒక పుట్టలో పాముగా ఉన్నది అని గ్రహించాడు. ఆ పుట్ట క్రింద రైతు దాచి ఉంచిన ధనం ఉన్నది. ఆ దనాన్ని రక్షిస్తూ ఉంది పాము. ఈసారి ఎలాగైనా ఈ జీవికి విముక్తి ప్రసాదించాలి అని అనుకున్నాడు. ఇంటిలోని వారిని పిలిచి "నాయనలారా! మీ ఇంటి వెనక పుట్ట క్రింద చాలా ధనం ఉన్నది. కానీ మీరు ముందుగా పుట్టలో ఉండే పామును చంపాలి." అన్నాడు. ఆ ఇంటిలో వారంతా పుట్టను గడ్డపారలతో పగలగొట్టడం ప్రారంభించారు. బయటికి వచ్చిన పామును గడ్డపారతో చంపేశారు. ఎవరి కొరకు అయితే తాను దాచిపెట్టిన ధనము రక్షించడానికి పాముగా జన్మించాడో, వారే అతని మరణానికి కారకులయ్యారు. అప్పుడు ఆ జీవికి ఆ రోజుతో వ్యామోహం వీడింది. మోహక్షయమైనది. మరి మోక్షమే కదా లభిస్తుంది.

- ఈ కథ ద్వారా మనం నేర్చుకోవలసినది ఏమనగా మానవ జన్మ పరంపరలకు మానవుని కోరికలే కారణం. ఈ కథలో రైతు తనకు ముక్తిమార్గమునకు అవకాశం వున్ననూ వినియోగించుకోలేదు. ఎందుకనగా విషయవాంఛలు అతన్ని బంధింప చేశాయి. కనుక బంధములకు లోనవకూడదు. "ప్రపంచం లో ఉండు కానీ, ప్రపంచం నీలో ఉండనీయకు. ఇదే వివేకానికి గుర్తు". అంటారు స్వామి.

7.వడ్లగింజను భూమిలో నాటితే మొలక వస్తుంది. పొట్టును తీసి వేసి నాటితే మొలక రాదు. మనం చేసే కర్మలను బియ్యంతోనూ, పొట్టును కోర్కెలతోను పోల్చుకోవచ్చును.

8.ఇది అంత సులభం కాదు. ఇది సాధించుటకు మానవుని కృషి, భగవంతుని కృప అవసరం. భగవంతుడి కృప పొందడానికి సరైన మార్గంలో సాధన చేయాలి.

9. పుట్టటము, చావటము, తల్లి గర్భం లోపల పిండ రూపమును ధరించడమూ, మళ్లీ అనిత్యమైనటువంటి ఈ జగత్తులో జీవిస్తూ జన్మను నిరర్థకం చేసుకోవటం కాకుండా, ప్రతి మానవుడు దేహాన్ని ఒక పవిత్రమైన మార్గంలో ప్రవేశింప చేయాలి. ప్రతి మానవుడు జగత్తులో ఒక దివ్య కార్యము సాధించుట కొరకే వచ్చాడు అన్న విషయాన్ని మర్చిపోకూడదు.

10.ప్రతి మానవుడు జగత్తు అనే కర్మాగారంలో ఒక పరికరంగా ఉంటాడు.

<u>ఉదాహరణకు</u> ఒక చిన్న పిన్ను, పెద్ద మిషన్ అంతటికీ ఆధారం అవుతుంటుంది. ఒక పెద్ద ట్రైను బయల్దేరి చాలా స్పీడ్ గా పోతున్నది. దానిని ఆపటానికి లక్షల మంది ప్రజలు వెళ్లి పట్టుకున్నప్పటికీ వారికే ప్రమాదం కలిగిస్తుంది కానీ ట్రైన్ నిలవదు. కానీ ఇంజన్ రూమ్ లో ఉన్న డ్రైవరు బ్రేకు అనే చిన్న పిన్ను ను వేసినచో ట్రైన్ ఆగిపోతుంది. అదేవిధంగా ఈ సమాజంలో ఏ మానవునికి జన్మ సార్థకం చేసుకునే శక్తి ఏ విధంగా ఉన్నదో (బ్రేక్ పిన్ను

లాగా) చెప్పుటకు సాధ్యం కాదు. కనుక ప్రతి వ్యక్తి కూడను తనను తాను జగత్కళ్యాణాన్ని ఆశించే శక్తిగా భావించుకోవడం ఉత్తమమైన లక్షణం.

11. ఈ సహజమైన భౌతిక దేహమునకు ప్రాణం పోవడం సామాన్యమైన ధర్మము.

ఒక చిన్న ఉదాహరణ: ఒక సైకిల్ టైర్ లేదా కారు టైరు చిన్న పిన్ను గుచ్చుకుంటే అందులోని గాలి అంతా వెళ్లిపోతుంది. అట్లే దేహమనే టైరుకు తొమ్మిది విధములైన పంచర్లు (నవ రంధ్రాలు: రెండు కళ్ళు, రెండు చెవులు, ముక్కు రంధ్రాలు రెండు, నోరు, పాయువు, మూత్ర ద్వారము) ఉంటున్నాయి. అయినను ప్రాణం పోవడం లేదు . ఇది చాలా ఆశ్చర్యకరం.

12. నీటి బుడగ వంటి ఈ దేహం నిమిత్తమై పరితపించకుండా పవిత్రమైన కార్యములలో దేహాన్ని ప్రవేశ పెట్టాలి.

“ పుట్టినప్పుడు ఏడ్చినావు, చచ్చునప్పుడు ఏడ్చుతావు.

మధ్యన ఎన్నింటికి ఏడ్చుతావు.

ధర్మ గ్లాని కలుగకుండా ఉద్ధరింప ఏడ్చినావా ?

ఎందుకోసం ఏడ్చినావు? ఏడ్పుకోసం ఏడ్చినావా ?" - బాబా

13. మానవుడు ఆశించిన దానిని ఈ జన్మలో సాధించలేకపోతే, ఆ ఆశలు తీర్చుకోవడానికి మరల మరల జన్మ ఎత్తవలసి వస్తుంది.

ఒక చిన్న కథ : షిరిడి బాబా - రెండు మేకలు కథ -

ఒకరోజు షిరిడి సాయి బాబా లెండి తోట నుండి తిరిగి వస్తున్నారు. దారిలో వారికి ఒక మేకల మంద ఎదురు పడినది. వాటిలో ఒక రెండు మేకల పై బాబా దృష్టి పడింది. బాబా వాటిని ప్రేమతో తాకి, లాలించిరి. ఆ మేకల యజమాని వద్దకు వెళ్లి ముప్పై రెండు రూపాయలు ఇచ్చి ఆ మేకలను కొనిరి. బాబా అలా చేయటం ఆయన భక్తులకు చాలా ఆశ్చర్యం కలిగించింది. బాబా మేకలు బేరం చేయడంలో మోసపోయారని వారి అభిప్రాయం. రెండు మేకలు కలిసి ఎనిమిది

రూపాయల కంటే ఎక్కువ విలువ చేయవు. ఆ విషయమే వారు బాబాకు వివరించిరి. శ్యామా మరియు తాత్యా బాబాను సమాధానం చెప్పమని వేడుకొనిరి. అప్పుడు బాబా "నాకు ఇల్లు కానీ, కుటుంబం కానీ లేదు. కావున నేను ధనమును నిలువ చేయనవసరం లేదు" అనిరి. ఆ తర్వాత బాబా తన వద్ద ఉన్న ధనముతో నాలుగు శేర్ల శనగపప్పు కొని మేకలకు పెట్టమని చెప్పి, తిరిగి ఆ మేకలను వారి యజమానికి ఇచ్చి వేసిరి.

అప్పుడు బాబా ఆ మేకల పూర్వ జన్మవృత్తాంతము గూర్చి ఈ విధంగా చెప్పిరి. వారిరువురూ గత జన్మలో ఒకే తల్లి బిడ్డలు. వారి అదృష్టం చేత నా మిత్రులైనారు. వారికి ఒకరి పై ఒకరికి చాలా ప్రేమ ఉండెను. రానురాను వారిరువురు శత్రువులుగా మారి అసూయ ద్వేషములతో కలహించుకొను చుండిరి. వారిలో శత్రుత్వం మరింత పెరిగి చివరకు ఒకరినొకరు చంపుకొనిరి.

నేను వారిని గుర్తించితిని కనుక, వారిని లాలించి, ఆహారం ఇచ్చి శాంతపరచితిని. నా బేరం మీకు నచ్చనందువలన నేను వాటిని యజమాని వద్దకు తిరిగి పంపితిని అనిరి.

- ఈ కథ వల్ల మనం తెలుసుకోవలసినది ఏమనగా అశాశ్వతమైనటువంటి ఈ దేహములో, ఈర్ష్యాద్వేషాలకు తావివ్వక, ఏ కోరిక బంధనము కలిగించునో, ఏది మోక్షమునకు కారణమో తెలుసుకొనవలెను.

<u>రామాయణం లోని రజకుని వృత్తాంతము</u> : సీతామాత పై అపనింద వాక్యములు పలికిన చాకలివాడు సీతామాత లవకుశ లను శ్రీరామచంద్రునికి అప్పగించి తన తల్లి అయిన భూదేవి ఒడిలోకి చేరి పోయిన తర్వాత ఒక నాడు రామచంద్రుని వద్దకు వచ్చాడు." స్వామి! నేను పాపిని. నా ఒక్క అనాలోచితమైన మాట వలన మహాతల్లి సీతమ్మ ఎన్నో కష్టములు అనుభవించవలసి వచ్చింది. మీరు కూడా ఎంతో మానసిక వ్యధకు గురి

అయ్యారు. లోకులందరు నన్ను నిందిస్తున్నారు. నా పాపానికి శిక్ష మరణదండనమే. అని రోధిస్తూ పాదాల పై వ్రాలాడు. శ్రీరామచంద్రుడు శాంత గంభీర స్వరంతో "నాయనా! ఈ అవతారంలో నేను క్షమామూర్తిని. నా చేతిలో నీవు మరణాన్ని అందుకోవాలనే కోరిక ఇంకొక జన్మలో తప్పక తీరుతుంది" అన్నాడు.

కృష్ణావతారంలో బలరామకృష్ణులు కంసుని ఆహ్వానాన్ని అందుకుని మధురానగరం పురవీధుల్లో విహరిస్తున్నారు. వారికి కంసభూపాలుని వస్త్రములు వుతికే చాకలి అంతఃపుర వాసుల అమూల్యమైన వస్త్రముల మూట తో ఎదురైనాడు. కృష్ణుడు వానిని వస్త్రముల నిమ్మనగా అతడు నిరాకరించాడు. అంతేకాక అవమానకరంగా మాట్లాడినాడు. అప్పుడు కృష్ణుడు బలవంతంగా ఆ మూటలోని పట్టు వస్త్రములు తనకు, తన సోదరునికి అవసరమైనవి తీసుకున్నాడు. చాకలి వానికి కోపం వచ్చి కొట్టుటకు ముందుకి ఉరికాడు.

కృష్ణుడు చిరునవ్వుతో అతని ని గట్టిగా కొట్టగా వెంటనే నేల మీద వాలి మరణించాడు. అతడు ఎవరు? రామావతారంలో ని సీతాపరిత్యాగానికి మూలపురుషుడైన చాకలి వాడు. అతని కోరిక మంచిదై నందుకు అవతారమూర్తి చేతిలో మరణించి ముక్తిని పొందాడు.

- అయితే కోరిక మంచిదైన చెడ్డదైన అది మరో జన్మకు బీజం అవుతుందని గుర్తించాలి.కోరిన కోరికలను సిద్ధించుకోటనికి మరల జన్మ వుంటుంది. ఈ సత్యాన్ని నిరూపించే కథలు పురాణ ఇతిహాసాలలో ఎన్నో ఉన్నాయి.

13. వర్తమానం ప్రధానం. మొట్ట మొదటతనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఎందుకనగా "జంతూనాం నరజన్మ దుర్లభం" అంటారు. ప్రతి మానవుడు భగవంతుని స్వరూపమే. అది తెలుసుకోకపోతే ఎన్ని కార్యములు చేసినప్పటికీ, ఎన్ని రకములైన సాధనలు సలిపినప్పటికీ వ్యర్థము.

MAN అనగా  M అంటే మాయను జయించి,

A అంటే ఆత్మ ను దర్శించి

N  నిర్వాణము అందుకునేవాడు అని అర్థము.

14. పెద్దల చెంత, అనుభవజ్ఞుల చెంత, ఉపదేశములను విని, ఆచరణలో వుంచి స్వశక్తితో ఆచరణ చేసినప్పుడే అర్థం అవుతుంది.

ఒక చిన్న కథ : మూడు ప్రశ్నలు : ఒక రాజుగారు తన దగ్గరకు వచ్చిన వారందరినీ మూడు ప్రశ్నలు అడిగేవాడు. ఎవరు శ్రేష్టుడు?, ఏ కాలము శ్రేష్టము?, ఏకార్యము శ్రేష్టము? అని. ఈ మూడింటిని తెలుసుకోవడానికి చాలా పరితపించే వాడు. అందరూ ఎన్నో విధాలుగా సమాధానాలు చెప్పారు కానీ ఏవి మహారాజుకు సంతృప్తిని కలిగించలేదు.

ఒకరోజు మహారాజు వేటకు వెళ్లి, అలసిపోయి ఒక ఆశ్రమం చేరుకున్నాడు. ఈ మహా రాజు ఆశ్రమం చేరేటప్పటికి ఆశ్రమవాసి అయిన  సాధువు పూల

మొక్కలకు నీరు పోయుచున్నారు. ఈ రాజు గారు అలసిపోయి రావటం సాధువు గమనించాడు. తక్షణమే తాను నీరు పోస్తున్న పాత్రను పక్కనపెట్టి, పరిగెత్తుకు వెళ్లి చల్లటి నీరును, తీయటి పండ్లను అందించాడు. ఇంతలో దేహమంతా గాయములు తగిలిన ఒక వ్యక్తిని కొంతమంది సాధువులు ఆశ్రమానికి తీసుకుని వచ్చారు. వెంటనే ఈ సాధువు శుద్ధమైన జలముతో గాయములు కడిగి, మూలికలతో తయారు చేసుకున్న ఔషధములను వేసి, అతనికి దగ్గరగా కూర్చుని మనశ్శాంతి నిమిత్తమై ఉపదేశాన్ని అందించారు. సాధవు యొక్క చల్లని మాటల వలన అతను బాధను మరిచిపోయి చక్కగా నిద్రించాడు. ఈ మహారాజు కాలాతీతమైనందువల్ల, తన రాజ్యానికి వెళ్లి వచ్చెదనని సాధువుకు కృతజ్ఞత తెలిపి, అనుమతిని కోరాడు. ఆ సాధువు ఆశీర్వదించి,అనుజ్ఞనిచ్చాడు. అప్పుడు మహారాజు తన మనసులో ఉన్న మూడు కోరికలను సాధువు ముందు వెల్లడించాడు. అందుకు సాధువు

నవ్వుచూ, మహారాజా! ఇంతవరకు జరిగిన విషయముల లోనే మీ మూడు ప్రశ్నలకు జవాబులు వున్నాయి. అవి ఏమనగా : నీవు ఆశ్రమానికి వచ్చిన సమయంలో నేను మొక్కలకు నీరు పోస్తున్నాను. అది నా కర్తవ్యము.

నా కర్తవ్య కర్మలను ఆచరించే సమయమందు నీవు ఆశ్రమానికి వచ్చావు కనక, ఆ పనిని పక్కనపెట్టి అతిథి ఆదరించటం కూడా నా కర్తవ్యం కనుక నీకు తియ్యని పండ్లు, చల్లని

నీరు ఇచ్చాను. నీ శ్రమ తీర్చాను. అంతలో గాయాలతో ఒక వ్యక్తి ఇక్కడికి వచ్చాడు. అతని బాధలు నివారించటం నా కర్తవ్యం. అది కూడా నిర్వర్తించాను.

1. ఎవరు మన దగ్గరికి వచ్చి సేవను కోరుతారు వారు శ్రేష్ఠమైన వ్యక్తి.
2. యేయే కార్యమునందు మన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తామో అదే శ్రేష్టమైన కార్యము.
3. యే కాలము మంచిది అంటావా? వర్తమాన కాలమే మంచి కాలము.

భవిష్యత్తును ఆలోచించటం, గడిచిన కాలాన్ని విచారించటం వలన ప్రయోజనం లేదు.

వర్తమానంలో మన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించినప్పుడు మన భవిష్యత్తు మంచిగా ఉంటుంది. ఈ మూడు కూడా పవిత్రమైనవి అని సాధువు చెప్పాడు.

## దైనందిన జీవితంలో ఈ శ్లోకాన్ని ఎలా అన్వయించు:

1. వర్తమానం నందు మీ కర్తవ్యం ఏమిటి? ఒకవైపు తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగిస్తూ, మీ విద్యార్థి జీవితం నందు ఎట్టి ఒడిదుడుకులు లేకుండా, ఏ కార్యమునకై మీరు కంకణం కట్టుకున్నారో దానిని సక్రమమైన రీతిలో సాధించుటకు పూనుకోవాలి.
2. ఆది శంకరాచార్యులవారు తన దేహమును దేని కొరకై వినియోగించినారో, ఎటువంటి సాధనాలు చేసినారో, వాటిని మీ నిత్య జీవితంలో ఆచరించవలెను.

3. “దీర్ఘ జీవితమును కాదు, దివ్య జీవితాన్ని కోరండి” అన్న సూక్తిని గుర్తుంచుకొనవలెను.

4. ఈ పవిత్రమైన దేహమును, జీవితమును వ్యర్థ పరచుకుని, చివరి క్షణంలో భగవంతునికి ఇస్తే స్వీకరించడు. ఉదా: పూతన.

5. మన లక్ష్యమును సాధించేవరకు దేహము భద్రమైన దిగా ఉంచుకోవాలి. అంతేకానీ దేహంపైన లక్ష్యం పెట్టి, మన లక్ష్యమును విస్మరించి జీవితాన్ని వ్యర్థం చేసుకొనుట సరైనది కాదు.

6. “బ్రతుకు తెరువును అందించేది కాదు విద్య, బ్రతుకు రహస్యమును తెలుపునది విద్య” అన్న స్వామి సూక్తిని మరువరాదు.

7. నాలుగు ఋణములు తీర్చుకునే నిమిత్తమై ఈ పవిత్ర దేహం వచ్చింది అవి ఏమనగా మాతృఋణం, పితృ ఋణం, దేవ ఋణము, ఋషిఋణము.

తల్లి ఎంతో కష్టపడి తన రక్తమును, ఆహారము సర్వస్వాన్ని కుమారునకు ధార పోస్తుంది. కనుక తల్లికి కృతజ్ఞత చెప్పాలి. తండ్రి పోషించి, పెద్ద చేసి, విద్యాబుద్ధులు చెప్పించి, తగిన సదుపాయములను చేకూర్చును కనుక తండ్రికి కృతజ్ఞత చెప్పాలి. ఈ పవిత్రమైన మానవజన్మ రావడం మహర్షుల యొక్క ఆశీర్వాదం. కనుక వారికి కృతజ్ఞతలు చెప్పాలి. అన్నింటికీ మూలాధారమైన వాడు దైవం. కనుక దైవానికి కృతజ్ఞతలు చెప్పాలి. మానవుడు కరెంటుకు, నీటికీ, ఇంటికి పన్ను (Tax) కడుతున్నాడు కానీ, పవిత్రమైన మానవజన్మను ఇచ్చిన భగవంతుడికి సుంకము(Tax) చెల్లించడం లేదు.

8. "జీవితం జీతం కొరకు కాదు, జీవించుటకు" అన్నది మరువరాదు.

9. ఆనందమునకు సాధన, సుఖమునకు ప్రార్థన, సౌఖ్యము నకు ధ్యానము వంటి సుంకము చెల్లించుకుని, భగవంతున్ని హృదయపూర్వకమైన శరణాగతి పొంది, శాశ్వతానందాన్ని పొందవలెను.

9. Part time devotion కాకుండా full time devotion పెంపొందించుకుని, హృదయ వాసి అయిన భగవంతుడికి నిన్ను నీవు సంపూర్ణంగా అర్పితం చేసుకున్నప్పుడే, నీ యొక్క సంపూర్ణ బాధ్యతను భగవంతుడు స్వీకరించి ఈ జనన మరణ వలయం నుండి తప్పించి శాశ్వత స్థానాన్ని ప్రసాదిస్తాడు.

10. "ఈ లోకానికి మంచితనము, ఆ పరలోకానికి దైవ సంబంధము అవసరమము"-బాబా

*****

2. త్వయి మయి సర్వత్రైకో విష్ణుః , వ్యర్థం కుప్యసి మయ్య సహిష్ణుః|

భవ సమ చిత్తః సర్వ త్రత్వం , వాంఛస్యచిరాద్యది విష్ణుత్వం||

➢ హరిగోవిందం -

- నీలో నాలో నిజమొక విష్ణువే , ఓపిక లేని నీ కోపము వ్యర్థము|

  ఎల్లడ సమమై ఉల్లంబుంటే ,అపుడే అనుభవమగు విష్ణుత్వం||

**భావము :** నీలో, నాలో సర్వులలో ఉన్నది విష్ణువే అని గుర్తించక ద్వైత భావముతో వ్యవహరిస్తూ కోపావేశాలకు గురి అవుతున్నారు. విష్ణుత్వము అనుభూత మొనర్చుకొనుటకు, అందరిలో ఉన్న భగవంతుడు ఒక్కడే అని విశ్వసించి, సమ చిత్తంతో వర్తించాలి.అది గుర్తించినప్పుడే అజ్ఞానము దూరమైపోతుంది. నీ కోపం నీకే అవకాశం కలిగించును. ఓపిక లేని మన కోపము మన పాపమునకు ధూపం వంటిది. కోపమును అరి కట్టుకునే విధానము క్రమ క్రమేణా చిత్తమందు ప్రాప్తిస్తుంది.

అయితే ఇది చెప్పినంత సులభం కాదు. ఆచరించుటకు మహనీయులకు కూడా ఇది దుస్సాధ్యమైనదని కొన్ని సంఘటనలు తెలుపుతున్నాయి.

**ఉదాహరణకు : ఆదిశంకరాచార్యులు – చండాలుని కథ :**

ఒకనాడు శంకరాచార్యులు కాశీ విశ్వనాథుని సేవించడానికి వెళ్తూ ఉండగా ఒక ఛండాలుడు శునకములతో ఎదురుగా వచ్చాడు. వెంటనే "దూరం దూరం

దూరంగా పొమ్ము" అని గద్దించాడు. ఆ చండాలుడు నవ్వుతూ" స్వామి! ఎవరిని దూరంగా పొమ్మం టు న్నారు. ఈ దేహము నా ? దేహము జడము . ఒక జడమైన దేహానికి మరొక జడమైన దేహాన్ని దూరంగా పొమ్మని చెప్పే అధికారం లేదు .ఒక జడము మరొక జడమును పలకరించడానికి వీలు లేదు. ఇక మీరు ఆత్మను దూరంగా పొమ్మంటున్నారా? అట్లయితే నీలో నాలో అందరిలో ఉన్నది ఆత్మయే కదా! అన్నాడు . శంకరాచార్యులు ఈ చండాలుడు సామాన్యుడు కాడని తెలుసుకొని తనకు కనువిప్పు కలిగించినందుకు కృతజ్ఞతలు తెలిపాడు. వచ్చినది కాశీ విశ్వేశ్వరుడే అని తెలిసినా, ఉన్నది ఒకటే ఆత్మ తత్వము అని లోకమునకు తెలియజేయుటకు ఈ సంఘటన జరుగునట్లుగా కాశీ విశ్వేశ్వరుడు ఆడిన నాటకం ఇది.

నామ్ దేవ్ - రొట్టెలు కథ : ఒకసారి నామదేవ్ పాండురంగనికి నివేదన చేసిన రొట్టెలు తాను భుజించడానికి కూర్చున్నాడు. ఇంతలో ఒక కుక్క వచ్చి రెండు

రొట్టెలను నోట  కరుచకుని పారిపోయింది . అది చూసి నామదేవ్  చేతిలో నేతి గిన్నెను తీసుకుని ఆ కుక్క వెంట పరిగెత్తాడు. ఎందుకు ? ఆ రొట్టెలను నేతి లో ముంచి కుక్కకు రుచికరముగా తినిపించుటకు. నామదేవ్  ఆ కుక్కను ఒక అల్పమైన జీవిగా భావించలేదు.

## రామకృష్ణ పరమహంస – పిల్లి లో కాళీమాతను దర్శించుట :

శ్రీ రామకృష్ణ పరమహంస కాళీమాతకు నివేదించిన క్షీరమును ఒక నాడు పిల్లి త్రాగుతుండగా చూచి అతడు" ఆహా! అమ్మ నిజంగా కరుణామయి. ఈ రూపంలో వచ్చి క్షీరము సేవించినది " అని భావించి ఆనంద పరవశుడైనాడు .

## స్వామి – పాము కథ :

ఒకసారి బృందావనం నుంచి స్వామి పుట్టపర్తికి కారులో వస్తున్నారు. స్వామి కారులోని వెనక సీట్లో అనుకుని కళ్ళు మూసుకుని ఉన్నారు. అప్పుడు రోడ్డుకు అడ్డంగా ఒక పెద్ద పాము పడుకుని ఉన్నది. డ్రైవర్ రాధాకృష్ణ గారు

కారు ఆపుదామనుకుని, స్వామిని చూడగా, స్వామి కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నారు. స్వామికి నిద్రాభంగం కలిగించడం ఇష్టంలేక ఆ పాము పైనుండే కారు నడిపారు. పుట్టపర్తికి చేరిన తర్వాత స్వామి డ్రైవర్ కి తన వీపు పై ఉన్న కారు టైర్ల గుర్తులు చూపించారు. ఏమిటి స్వామీ? అని అడుగగా, ఆ పామును రక్షించుటకై , కారు దానిపై పోనీయకుండా తాను అడ్డుకున్నానని చెప్పి, అన్ని జీవుల యందు తాను వున్నానని తెలియజేశారు. సకల జీవరాసులకు కలిగే రాగద్వేషాలకు, క్రోపతాపాలకు కారణం ద్వైత భావమే .నీవు వేరు, నేను వేరు అనే భేద భావము వీడి సమదృష్టిని అలవర్చుకోవాలి. “సమదృష్టి శుభ దృష్టి”అంటారు. చైతన్య మహాప్రభు, గాంధీజీ హరిజనులను కౌగలించుకుని వారితో ఆప్యాయంగా సంభాషించేవారు. అందరియందు ఉన్నది ఒకే చైతన్యమని, భగవంతుడు ఒక్కడే అని భావించి గుర్తించటం చాలా కష్టం.

## ఒక చిన్న కథ : నీలో నాలో నిజమొక విష్ణువే! -

ఒకసారి చోళ దేశపు రాజు గారికి శ్రీరంగం లోని శ్రీరంగనాధుని దర్శించి, ఆ ఆలయ గోపుర వైభవాన్ని కళ్ళారా చూడాలనే తీవ్రమైన వాంఛ కలిగింది. ఒక రోజు తన రథంలో శ్రీరంగం వైపు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఒక దివ్య పురుషుడు ఎదురైనాడు. రాజు తన రధాన్ని ఆపి, దిగి నమస్కరించాడు. ఇద్దరూ కొంత సేపు ఎన్నో విషయాలను ఆసక్తికరంగా సంభాషించు కొన్నారు. రాజు తాను శ్రీరంగమునకు బయలుదేరిన విషయమే మర్చిపోయాడు. రధాన్ని నగరం వైపు మళ్ళించమన్నాడు.

ఈ విధంగా చాలా సార్లు జరిగింది. ఒకరోజు రాత్రి రాజు ఈ విధంగా అనుకున్నాడు. “ఇది ఏమిటి? ఎన్నిసార్లు నేను ప్రయత్నించినా శ్రీరంగనాధుని సన్నిధి చేరలేక పోతున్నాను. నా ఇష్టదైవాన్ని దర్శించే ప్రాప్తి ఈ జన్మకు ఇక లేదేమో!” అని నిద్రించాడు. ఆ రాత్రి స్వప్నంలో శ్రీరంగనాథుడు కనపడి “రాజా!

విచారం ఎందుకు? ప్రతిసారి రథానికి ఎదురుగా వచ్చి నిన్ను శ్రీరంగం చేరనీయకుండా ఆటంకపరిచినది ఎవరనుకున్నావు? నేనే! అందరిలోనూ నన్ను దర్శించ కలిగే దృష్టిని, ప్రేమ తత్వమును అలవర్చుకో!" అని అంతర్థానమయ్యాడు.

- భగవంతుని దర్శించాలని తీవ్రమైన వాంఛ ఉండటమే కాదు, అందరిలోనూ భగవంతుని దర్శించగల సమ భావన కూడా ఉండాలి. ఇది సాధన వల్లనే సాధ్యం అవుతుంది.

## ఉదాహరణ ఏకనాథుడు - సర్వ భూతాంతరాత్మ :

ఏకనాథుడు మహారాష్ట్రకు చెందిన మహా భక్తుడు. అతను ఒకసారి కాశీకి వెళ్ళాడు. అక్కడ కాశీ విశ్వేశ్వరుని దర్శించి గంగాజలమును బిందెలతో నింపుకుని కావడిలో పెట్టుకుని తన శిష్యులతో బయలుదేరాడు. కాశీ

తీర్థమును రామేశ్వరం వద్ద సముద్రంలో కలుపుట ఒక ప్రాచీన భారతీయ సంప్రదాయం.

ఏకనాథ్ తన శిష్యులతో ప్రయాణం చేస్తుండగా మార్గమధ్యంలో ఒక గాడిద నోరు తెరుచుకుని, గిలగిల కొట్టుకుంటూ నేలమీద పడి ఉండడం చూశాడు. అది ఎండాకాలం దాహంతో ఆ గాడిద ప్రాణం విడిచే స్థితిలో ఉంది. వెంటనే ఏకనాథుడు కావడిలో ఉన్న బిందెడు నీరు దాని నోటిలో పోసి, దాని మీద కొంచెం చల్లాడు. కొంచెం సేపటికి ఆ గాడిద కన్నులు తెరచి మెల్లగా లేచి తోకాడిస్తూ వెళ్ళిపోయింది. అదంతా చూస్తున్న అతని శిష్యులు "స్వామీ! పవిత్రమైన గంగా జలమును, రామేశ్వరమున రామలింగస్వామి కి అర్పించ వలసిన తీర్థమును ఈ గాడిద నోట్లోపోశారే?" అని ప్రశ్నించారు.

అంతట ఏకనాథ్ "నాయనలారా! 'ఈశ్వర సర్వభూతానాం' అన్న సత్యాన్ని మరిచారా? సర్వ జీవుల యందు సర్వేశ్వరుడు ఉండును అని తెలియదా?

భగవంతుడికి కాశీ జలమేమిటి? రామేశ్వర జలమేమిటి ? అంతా ఒక్కటే. మీ దృష్టికి అది గాడిదగా కనిపించింది. నాకు మాత్రం రామలింగ స్వామి ఆ జీవిలో కనిపించాడు. దాహం తీర్చని కోరాడు. నేను చేసినది అతి పవిత్రమైన కార్యము" అని వారికి తెలియజేశాడు.

- సృష్టిలోని అణువణువులో పరతత్వమును గుర్తించే దృష్టి అలవరచుకోవాలి.

దీనికి చిన్న ఉదాహరణ: సినిమాలో చిత్రములు (pictures)అనేక విధములుగా ఆవిర్భవిస్తుంటాయి. కానీ ఈ చిత్రములన్నీ ఒక్కటేపులో చేరిపోవడం చేత, ఆటేపు పైన విద్యుత్ శక్తి ప్రసరణ ద్వారా ఈ చిత్రములను అందులో ప్రదర్శించడానికి మూల కారణం అవుతుంది. విద్యుత్ శక్తి ఒక్కటే, టేపు ఒక్కటే. విద్యుత్ శక్తికి నీడగా ఆ టైపు తిరుగుచుండడంచేత చిత్రవిచిత్రమైన బొమ్మలంతా మనలను భ్రమింప చేస్తున్నాయి. అదేవిధంగా

మన ఇంద్రియములనే చిత్రములన్నీ మనస్సు అనే టేపునందు చేరిపోవడం చేత, బుద్ధి అనే కరెంటు ద్వారా ఈ విశాలమైన జగత్తును చిత్రముగా మనము భ్రమిస్తున్నాము.ఈ ఇంద్రియములు మనస్సుతో చేరి, బుద్ధిని అనుసరించటం చేతనే, మనకు చిత్ర విచిత్రములు, భిన్నమైన రూప నామములు కనిపిస్తున్నాయి. అవే ఇంద్రియములు, మనస్సు ద్వారా హృదయమునకు చేరినప్పుడు స్వస్వరూపమైన తత్వాన్ని అనుభవిస్తాయి. అప్పుడే ఏకత్వం అనుభవం అవుతుంది.

ఉదాహరణ : ఒక వ్యక్తి తాను వివిధ నామ రూపములను ధరించి కొన్ని రకములైన నాటకములను ప్రదర్శిస్తున్నాడు. ఒకే వ్యక్తి నాలుగు రంగములందు రూప నామములను వేరుగా ధరించాడు. మరి ఈ వ్యక్తి ఒక్కడా లేక నలుగురా అనే విచారిస్తే, ఈ నాలుగు రంగములందు (జాగ్రత్, స్వప్న, సుషుప్తి,

తురీయావస్థ) ఉన్న ఏకత్వం ఒక్కటే. "సమత్వం యోగ ముచ్యతే" యోగం వలన సమత్వము ప్రార్థిస్తుంది.

- సంస్కారము వలననే సమత్వం కలుగుతుంది. <u>ఉదాహరణ :</u> భూమినుండి సహజమైన బంగారాన్ని తీస్తున్నాము. అప్పుడు దాని సస్వరూపము నకు ఎటవంటి విలువ ఉండదు. దీనిని అనేక విధములుగా సంస్కరించుట చేత పరిశుద్ధమైన స్వరూపం కలిగి, విలువైన స్థానాన్ని పొందుతుంది. విలువ లేని బంగారమును సంస్కరించుట చేత దానికి విలువ ఏర్పడింది. అదే విధంగా ప్రాకృత మైన గుణదోషాలతో ఉన్నటువంటి మానవుడు, తన వ్యక్తిత్వాన్ని సంస్కరించుట చేత పవిత్రమైన గుణములు ఏర్పరుచుకుని, సమ చిత్తాన్ని పొందగలుగుతున్నాడు.

## దైనందిన జీవితంలో అన్వయించు కొనుట :

1. దివ్యాత్మ ప్రతి వ్యక్తి యందు కూడను ఆధారభూతమై వుండి, ఏక స్వరూపమై సంచరించునది అన్న సత్యాన్ని గుర్తించి వర్తించాలి.
2. కోపం వల్ల కలుగు నష్టములు, ఇబ్బందులు గురించి ఆలోచించాలి.
3. కోపం వచ్చే ఒక్క క్షణాన్ని నీవు జయిస్తే, బాధపడే 1000 క్షణాలను తప్పించుకోగలుగుతాము.
4. కోపం నియంత్రించుటకు స్వామి చెప్పిన నాలుగు మార్గములను ఆచరించాలి.
   - కోపం వచ్చినప్పుడు ముఖం అద్దంలో చూసుకొనుట.
   - ఒక గ్లాసు చల్లటి నీరు త్రాగుట
   - నీళ్ల పంపు తిప్పి, సమాన స్థాయిలో భజన పాట పాడుట.
   - ఒక ఫర్లాంగు దూరం పరుగెత్తుట.
5. మౌన సాధన, ధ్యానము ద్వారా కోపమును బాగా నియంత్రించుకో వచ్చును.

6. అన్ని వేళల సముచితాన్ని అలవర్చుకున్నప్పుడే, విష్ణుత్వము అనుభూతమవుతుంది.

కనుక" పరుష భాష వలన పశువుల వుతారు. మధుర భాష వలన పశుపతుల వుతారు"

"ఇంద్రియ నిగ్రహం ఉంటే దైవానుగ్రహం లభించును" అన్న స్వామి సూక్తులను నిరంతరం పాటించాలి.

*****

3. శత్రౌ మిత్రే పుత్రే బంధౌ , మా కురు యత్నం విగ్రహ సంధౌ|

సర్వస్మిన్నపి పశ్యాత్మానం , సర్వత్రోత్సృజ భేదాజ్ఞానం||

➢ హరిగోవిందం -

- శత్రువు,మిత్రుడు,పుత్రుడు,బంధువు అనుచు ఉపేక్షాపేక్షలు మానుము|

  అన్నిటిలోనూ ఆత్మను చూడుము , భేదమనే అజ్ఞానము వీడుము||

భావము : శత్రువని, మిత్రుడని, పుత్రుడని, బంధువని ఉపేక్ష లు, ఆపేక్షలు అనే ద్వంద్వములు సాధకులకు తగవు.

"ఈశ్వర సర్వభూతానాం" అనే సత్యాన్ని గుర్తించి భేద భావాన్ని త్యజించాలి. అప్పుడే ఆత్మ సాక్షాత్కారం లభిస్తుంది. భేద భావానికి అజ్ఞానము, మోహము కారణములు. ఈ భ్రాంతి వదిలితే సమ దర్శనం అలవడుతుంది. సమ దర్శనమే జ్ఞానానికి లక్ష్యం. "ఆత్మవత్ సర్వభూతాని" అని అన్నింటిలోనూ పరమాత్మను గుర్తించిన వాడే జ్ఞాని. సమదృష్టి కలవాడే నిజమైన పండితుడు.

వివరణ : లోకమునందు వీరు మిత్రులని, వీరు శత్రువులని, వీరు పుత్రులని, వీరు బంధువులని కొన్ని కొన్ని దేహములకు కొన్ని కొన్ని పేర్లు పెట్టుకుని పిలుస్తుంటాము. మన దేహమునందు వుండే ఇంద్రియములను అనేక పేర్లతో పిలుస్తుంటాము. ఇది కాలు, ఇది చెయ్యి అని. రూప నామములు దేహానికి కాని ఆత్మకు కాదు. రూప నామములకు, ఆత్మకు ఎటువంటి సంబంధం లేదు.

ఉదాహరణకు దేహంలోని ఏదైనా ఒక భాగమునకు శస్త్రచికిత్స చేయవలసిన అవసరం ఏర్పడినప్పుడు మనము ముందు వెనక యోచించి, దానికి చికిత్స చేయించుటకు పూనుకుంటాము. ఆ భాగమును ద్వేషించటం కానీ, దూషించటం కానీ చేయము. రెండింటి యొక్క క్షేమమును మనము ఆశిస్తాము. అంతేకాక దేహములోని అన్ని భాగముల యొక్క క్షేమమును మనం కోరుకుంటాము. అదేవిధంగా అందరియందు సమభావన పెంచుకోమని బోధిస్తుంది ఈ దేహం.

అనాది కాలం నుండి అనుకూలమైన వస్తువులను ప్రేమించటం, అననుకూల వస్తువులను ద్వేషించటం పరిపాటి అయినది. దీనిని మనం సరిదిద్దుకోవాలి.

ఉదాహరణ:-మన దంతములు మన నాలుకను కరుస్తాయి. కరిచిన సమయము నందు పండ్లను దండించడమో లేక నాలుకను బుజ్జగించడమో చేయము. మన అజాగ్రత్త వల్ల ఈ బాధకు గురి అయితిమని తెలుసుకుంటాము.

ఈ రెండూ మన యొక్క స్వాధీనంలో ఉండుట చేత, రెండూ మనది అని విశ్వసించి, అభిమానించుట చేత, రెండింటి యొక్క క్షేమము ఆశించుట చేత, ఇది నాలుక యొక్క అజాగ్రత్తయే అని భావిస్తాము.

అదేవిధంగా బ్రహ్మాండమైనట్టి ఈ జగత్తులో ఉన్న వ్యక్తులు అందరూ , ఆత్మలోని అంగములుగా మనము విశ్వసించ వలసిన అవసరం ఉన్నది. ఈ ఆత్మలోని అంగములు ఒక దానితో ఒకటి ద్వేషించటం కానీ, విమర్శించడం కానీ, నేను గొప్ప, నీవు గొప్ప అని భావించుటకు ఏమాత్రం అవకాశం లేదు. దేహము లోని ఒక భాగము ద్వారా, ఇంకొక భాగమును బాధకు లోనై నప్పుడు (నాలుక, పండ్లు) ఏ రీతిగా సహించుకుంటున్నామో అదేవిధంగా దేశంలో ఉన్న వ్యక్తులు ఒకరిని ఒకరు ద్వేషించు కున్నప్పుడు మనం దానికి ఆపటానికి ప్రయత్నం చేయాలి.

మానవత్వము రెండు పదార్థముల మిశ్రమ స్వరూపము. ఒకటి ఆత్మ రెండవది అనాత్మ. కనుక అందరిలోనూ పరమాత్మను దర్శించిన ఎటువంటి భేద భావములు గోచరించవు.

<u>చిన్న కథ : ధర్మరాజు జీవితంలోని కొన్ని ఘట్టములు:-</u>

- సమదృష్టి గల వారిలో ధర్మరాజు ఆదర్శప్రాయుడు. పాండవులు అరణ్యవాసం చేసే సమయంలో ఒక నాడు శ్రీకృష్ణుడు వారిని విచారించే నిమిత్తం వెళ్ళాడు. ఆ సమయంలో ధర్మరాజు ఒక్కడే కనిపించాడు." బావ! నీ సోదరులు ఎక్కడ? కనిపించడం లేదే?" అని కృష్ణుడు అడిగాడు. "కొంతమంది హస్తినాపురంలో ఉన్నారు, కొంతమంది కందమూలాదులు తీసుకొని రావటానికి వెళ్లారు" అన్నాడు ధర్మరాజు. శ్రీకృష్ణుడు ఆశ్చర్యం ప్రకటించి "అదేమిటి బావ! నీకు మతి పోయిందా! ఐదు మంది అరణ్యం లోనే ఉన్నారు కదా! హస్తినాపురం లో వున్న కౌరవులు నీకు శత్రువులు కదా! వారిని తమ్ములుగా ఎలా

భావిస్తున్నావు?”అని ప్రశ్నించాడు. “కృష్ణా! శతృత్వము, మిత్రత్వమూ కొన్ని బాహ్య బంధాల వలన ఏర్పడతాయి. వ్యక్తిగత ద్వేషము లెన్నో ఉండవచ్చును .కానీ కౌరవులు మాకు సోదరులే కదా! అని ధర్మరాజు సమాధానం చెప్పాడు.

గంధర్వులు-కౌరవుల మధ్య యుద్ధం: .పాండవులు అరణ్యవాసం చేసే సమయంలో దుర్యోధనుడు తన పరివారంతో బయలుదేరాడు. తన దర్పాన్ని ప్రదర్శించి, పాండవుల దైన్య స్థితి ని చూసి పరిహాసం చేయాలనే దురహంకారంతో అరణ్యంలో ప్రవేశించాడు. కారణాంతరాల వలన గంధర్వులకు కౌరవులకు యుద్ధం జరిగింది. గంధర్వులు దుర్యోధనుని బంధించారు.ఈ వార్త ధర్మరాజుకు తెలిసింది. ధర్మరాజు తక్షణమే గంధర్వుల బారి నుండి రక్షించ మని భీమార్జునులను ఆదేశించాడు. తన పట్ల శతృత్వం ప్రకటించే కౌరవుల ఎడల కూడా ధర్మరాజు భేదభావాన్ని పెంచుకొనలేదు.

- అందరిలో ఆత్మను చూడగలిగే దృష్టి గలవాడు ధర్మరాజు.

**ధర్మరాజు మహాప్రస్థానం** : మహాప్రస్థాన సమయము నందు ఇంద్రుడు స్వర్గానికి ధర్మరాజు ఆహ్వానించాడు. ఆ సమయంలో ధర్మరాజు వెంట అనుసరించుచున్న కుక్కను కూడా స్వర్గ ప్రవేశాన్ని కలిగించమని కోరాడు. అట్లు అనుమతించని యెడల తనకు స్వర్గమే వలదననినాడు. కుక్కలో కూడా పవిత్రమైన ఆత్మతత్వాన్ని దర్శించగలిగాడు ధర్మరాజు.

**రామకృష్ణ పరమహంస - నాగ మహాశయుడు** : నాగ మహాశయుడు, శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యుడు. ఒక నదీ తీరం లో విహరిస్తున్నాడు. ఆ సమయంలో కొంతమంది చేపలు పడుతున్నారు. వలలో కొన్ని చేపలను పైకి తీశారు. మీకు నేను డబ్బులు ఇస్తాను వాటిని వదిలేయండి" అని ప్రార్థించాడు. ఈ విధంగా ఎప్పుడూ ప్రవర్తించేవాడు నాగ మహాశయుడు .

- <u>బుద్ధ భగవానుడు- దేవదత్తుడు</u> : బుద్ధ భగవానుడు తనను అనేకసార్లు చంపడానికి ప్రయత్నించిన దేవదత్తున్ని క్షమించి, అతడు వ్యాధిగ్రస్తుగా ఉన్నప్పుడు వెళ్లి సేవలు కూడా చేశాడు.
- శత్రువైన రావణాసురుని సోదరుడు విభీషణునికి శ్రీరాముడు అభయమిచ్చాడు.
- ఉపపాండవులను సంహరించినప్పటికీ ద్రౌపదీదేవి అశ్వత్థామను క్షమించుట.
- మహమ్మద్ ప్రవక్తను రాళ్లతో రక్తం వచ్చేటట్లు కొట్టినప్పుడు అతడు చూపిన సంయమనం.
- యేసు క్రీస్తును శిలువ వేసే సమయంలో అతడు చూపిన సహనం వలన అందరిలో ఉన్న ఆత్మస్వరూపం ఒక్కటే అని తెలుసుకొన్న వాడు జ్ఞాని అని తెలుస్తుంది.

## దైనందిన జీవితంలో అన్వయించు కొనుట :

1. మన హద్దులలో మనం ఉండటం వలన ఎవరితో శత్రుత్వం ఏర్పడదు.
2. నిజమైన మిత్రుడు భగవంతుడు మాత్రమే.
3. అందరిలోనూ ఉన్న భగవంతుడు ఒక్కడే. ఉదాహరణకు ఆవుదూడ బురదలో చిక్కుకున్నప్పుడు, ఒక బక్కచిక్కిన సాధువు దానివి ఒడ్డుకు చేర్చి, నా శారీరక బాధను నివారించుకున్నాను అని తెలియజేశారు.కనుక "మన భారతీయ సంస్కృతిని పెంపొందించుటకు, ధర్మాచరణ చేయుటకు స్వామి చెప్పిన రీతిలో "సహనమన్నదే మనకు చక్కదనము" గుర్తుపెట్టుకుని అందరితో మిత్ర భావాన్ని పెంపొందించుకుని, భేద భావాన్ని త్యజిద్దాము.

*****

4. గేయం గీతా నామ సహస్రం , ధ్యేయం శ్రీపతి రూప మజస్రం|

నేయం సజ్జన సంగే చిత్తం , దేయం దీన జనాయ చ విత్తం||

➢ హరిగోవిందం -

పాడుము గీతలు నామ సహస్రము, భగవంతుని రూపము భావింపుము|

సలుపు నెపుడు సజ్జన సాంగత్యము,దీన జనులకై దానము చేయుము||

భావము : భగవద్గీత, విష్ణు సహస్రనామము మొదలైన పవిత్ర గ్రంధముల పారాయణము ఆధ్యాత్మిక సాధనలో ప్రధానము. గీతా గానము, నామకుసుమములతో హరి స్మరణము, నిత్యము శ్రీహరి అర్చనము, సజ్జనులతో స్నేహము, దీనజనులకై దానము. ఈ పవిత్ర కర్మలను ప్రతినిత్యం ఆచరించాలి.

**ముఖ్యాంశములు :**

1. "గేయం గీత" అనగా గీతను పాడమని అర్థము. ఈ గీతను పాడడం చేత లభించే ఫలితం ఏమిటి? మానవులు విషయ సంబంధమైన రాగములకు గురి కావడం చేత అశాంతి అనే రోగములో తపిస్తూ ఉంటున్నాడు. ఈ అశాంతి అనే రోగమును దూరం చేసుకునే నిమిత్తమై గీతను గానం చేయమన్నాడు.

గీతయే భగవానుని దూత , గీతయే జగదేకమాత

గీతయే సాధకునికి వూత , గీతయే సంసారికి ఈత

గీతయే మంత్రాల మూట , గీతయే వేదాంతపు వూట

గీతయే ఘన రాజ బాట , గీతయే పుష్పాల తోట.

ఇదియే శ్రీ సాయి మాట.

ఇట్టి పవిత్రమైన గీతను పాడమన్నారు.

వేదముల సారము ఉపనిషత్తులు అయితే, 108 ఉపనిషత్తుల సారమే భగవద్గీత. గీత యొక్క ప్రధాన సందేశము (మమ ధర్మ) స్వధర్మ నిర్వహణ. భగవద్గీత అర్జునునికి "నావారు"అనే మమకారాన్ని, "నా చేత చంపబడుతున్నారు" అనే అహంకారాన్ని పోగొట్టి, జ్ఞానాన్ని కలగజేసినది.జ్ఞానంతో సమానంగా పవిత్రమైనది ఈ ప్రపంచంలో ఏదీయూ లేదు అని తెలియజేసినది .

గీత ధీనుడయిన అర్జునుడిని ధీరుడు గా మార్చి, మనోధైర్యాన్ని ఆత్మస్థైర్యాన్ని కలిగించినది.

నిష్కామ బుద్ధితో, ఈశ్వరార్పణ బుద్ధితో, ఫలాపేక్ష లేకుండా కర్మను ఆచరించవలెనని తెలియజేసినది.

ఏ కర్మ బంధము కలిగించునో, ఏ కర్మ ముక్తి మార్గము చూపునో తెలియజేసినది.

భగవంతుడు అనన్యమైన భక్తితో లభించునని, అందుకు భగవంతుడిపై మనస్సును కలిగి ఉండి, అతనిని శరణు పొందమని తెలియజేసినది.

**షిరిడిసాయి బాబా-బాబు సాహెబ్ జోగ్ :** షిరిడీ సాయిబాబా దర్శనానికి ఒకనాడు బాబు సాహెబ్ జోగ్ ఒక పార్సెలును ( parcel) తీసుకొని వచ్చాడు. బాబాకు సాష్టాంగ నమస్కారము చేసేటప్పుడు అది కింద పడింది. "అదేమిటి" అని ప్రశ్నించారు. " ఇది భగవద్గీత " అని బదులు చెప్పి బాబు సాహెబ్ ఆ గ్రంథాన్ని బాబా చేతిలో వుంచాడు. బాబా కొన్ని నిమిషాలు కొన్ని పేజీలు త్రిప్పి ,తన జేబులో ఉన్న ఒక రూ రూపాయి ఆ గ్రంధము పై పెట్టి ,దక్షిణతో పుస్తకాన్ని తిరిగి అందిస్తూ " దీనిని పూర్తిగా చదువు నీకు మేలు కలుగుతుంది" అన్నారు బాబా భక్తులకు పవిత్ర గ్రంథ పఠనము ఒక సాధనగా నిర్దేశించేవారు.

2. "కలియుగంలో నామస్మరణను మించిన తరుణోపాయం లేదు". అంటారు స్వామి.

కనుక భగవంతుని సహస్ర నామములు, అనగా  ఏరూపమైన, ఎట్టి నామమైన పారాయణ చేయుట మంచిది.

శ్యామా-విష్ణు సహస్రనామ పారాయణ :(From Chapter 27  Shiridi Sai Satcharitra)

శ్యామ బాబాకు ప్రియ భక్తుడు. బాబా శ్యామాకు  మేలు సంకల్పించి అతని చేత విష్ణుసహస్రనామ పారాయణ చేయించ వలెనను కున్నారు.  ఒకనాడు రామదాసి( follower of saint Ramdas) అనే భక్తుడు బాబా దర్శనం కోసం వచ్చాడు. అతని చేతిలో విష్ణుసహస్రనామం గ్రంథం ఉన్నది. బాబా తనకు కడుపు నొప్పిగా ఉన్నదని, మందు తీసుకురమ్మని రామదాసుని బజారుకు పంపారు. ఆ సమయంలో రామదాసు అక్కడ విష్ణు సహస్రనామం పుస్తకం పెట్టి వెళ్లారు . ఆ పుస్తకాన్ని బాబా శ్యామాకు ఇస్తూ "ఇది చాలా విలువైనది.

ఫలప్రదమైనది. దీనిని చదువుము. రోజుకు ఒక నామము చదివిన చాలు, మేలు కలుగును" అని పలికారు. చావుపుట్టుకల నుండి, తరించే సులభ మార్గం భగవన్నామస్మరణ. విష్ణు సహస్రనామ పారాయణం చిత్తశుద్ధికి విశాలమైన చక్కని మార్గం అని విష్ణుసహస్రనామ పారాయణ విశిష్టతను శిష్యులకు బోధించారు.

ఏకనాథుడు -విష్ణు సహస్రనామ పారాయణ కథ : ఏకనాథ్ పరమ భాగవతోత్తముడు. అతడు ధన సంపాదన మే ముఖ్యంగా అనుకునే తన పొరుగు ఇంటి వ్యక్తికి శ్రీ విష్ణుసహస్ర నామ పారాయణం గావించి అతనిలో పరివర్తన కలుగునట్లు చేశాడు.

ఇంటి ప్రక్కనే ఒక వ్యాపారి ఉండేవాడు. అతను తన కుటుంబ పోషణ ప్రధానంగా భావించేవాడు. వ్యాపారి జీవించే విధానాన్ని పరిశీలించాడు ఏకనాథ్.

అతను ఏనాడూ పురాణ శ్రవణం కానీ, భజనలుకు కానీ వినలేదు. దైవ ప్రార్థనలు చేసేవాడు కాదు. మానవజన్మ ఎత్తి పొరుగు వారికి సహాయం చెయ్యడం , నామస్మరణ చెయ్యడం నేర్పించి ఆ వ్యాపారిని మంచి మార్గంలో ప్రవేశపెట్టి భగవదనుగ్రహం పొందేటట్లు చేయాలని నిశ్చయించుకున్నారు ఏకనాథ్. ఆ వడ్డీ వ్యాపారిని పలకరించగా, ఆ వ్యాపారికి ఆలోచనలు పరిపరి విధాలుగా పరుగెడుతనాయి. భయపడ్డాడు. “ఇతనేమైనా ధన సహాయం కోరతాడేమోనని” వ్యాపారి భయపడ్డాడు. అతని ఆలోచనలను పసిగట్టిన ఏకనాథ్ “అయ్యా నాకు నీ ధనము మీద ఏమాత్రమూ ఆశ లేదు. ఎప్పుడైనా తీరిక అయినప్పుడు మా ఇంటికి వచ్చి మేము గానం చేసే భజనలు వినండి” అన్నాడు. ఆ వ్యాపారి “నిత్య వ్యవహారాలు చక్క బెట్టుకునేందుకే నాకు సమయం చాలదు, నేను రాలేను” అన్నాడు. అప్పుడు” నేను విష్ణు నామం ఒక కాగితం మీద రాసిస్తాను దానిని స్మరించండి” అన్నాడు. ఏకనాథ్ మధురమైన

మాటలు విన్న వ్యాపారి కొంత తృప్తి పడి అంగీకరించాడు. ఆ నామము స్మరించి మరునాడు ఏకనాథ్ వద్దకు వచ్చి మరొక నామమును వ్రాసి ఇవ్వమని దాన్ని కూడా మననం చేశాడు. ప్రతిరోజు ఒక నామం చొప్పున అన్ని నామాలు నేర్చుకున్నాడు ఆ వ్యాపారి. ఒకసారి ఏకనాథ్ ఆ వ్యాపారికి స్నానం చేసిన తర్వాత కొద్దిసేపు మౌనం పాటించి నిశ్చలంగా కూర్చుని సహస్ర నామ జపం చేయవలసింది గా చెప్పాడు. అదే విధంగా వ్యాపారి చేశాడు. అతనిలో క్రమంగా మార్పు వచ్చింది. భగవంతున్ని దర్శించాలనే తపన కలిగింది. సంకీర్తన లో పాల్గొన సాగాడు. కొంతకాలం గడిచిన తరువాత ఆ వ్యాపారి ఆరోగ్యం క్షీణించ సాగింది. చివరి క్షణంలో కూడా ఈ విష్ణు సహస్ర నామములను మననం చేసుకుంటూనే ఉన్నాడు. విష్ణు సహస్ర నామ జపం వలన పుణ్యలోకాలు ప్రాప్తించాలని.

3. సజ్జనసంగం : ఎన్ని పూజలు చేసినప్పటికీ, ఎన్ని రకములు చేసినా, ఎన్ని యాత్రలు తిరిగినా, ఎన్ని ఆరాధనలు సలిపినప్పటికీ సత్సంగము లేనియెడల, మన అంతఃకరణ లో కరడు కట్టుకున్న భావములు పోవటానికి వీలుండదు. కనుక ఆ భావములు నశింప చేసుకునే నిమిత్తమై సజ్జన సాంగత్యం అవసరం అంటున్నారు. ఎక్కడ సత్యము, త్యాగము, అహింస, ప్రేమతత్వం లతో కూడిన వాతావరణం ఉండునొ, అదియే సజ్జనసంగము అని పిలవవచ్చు. దీనివలన పవిత్రమైన భావములు ఒకరిని చూసి మరొకరు అభివృద్ధి పరచుకొనుటకు అవకాశం ఉంటుంది. మనము ఏకాంతముగా ఉంటున్నప్పుడు అపవిత్రమైన భావములు ప్రవేశించి, మనలను బలహీనులను చేయును.

ఉదాహరణకు : వస్త్రం లోపల అనేక దారములు ఉండును. ఒక్కొక్క దారమును తీసి రెండు వేళ్ళతో త్రుంచవచ్చును. అన్ని దారములు చేరి ఒక వస్త్రం అయినచో తుంచటానికి వీలుకాదు.

ఒక గడ్డిపోచ చిన్న చీమ నయినా బంధించడానికి వీలుకాని బలహీన స్థితిలో ఉంటుంది. కానీ  అనేక వేల గడ్డిపోచలను చేర్చడంచేత, మదించిన ఏనుగును కూడా బంధించవచ్చును.

అలాగే మనలో ఉన్న చెడు గుణములు కానీ, మంచి గుణములు కానీ మనం చేసే సహవాసమును బట్టి  ఉంటుంది. చెడు గుణములు దూరం చేసుకోవాలంటే మంచి గుణములు కలిగిన వారి సంగంలో ప్రవేశించాలి. దీనివలన సద్భావములు, సద్బుద్ధులు, సత్ప్రవర్తన, సదా ఆలోచనలు అలవడుతాయి.

ఒక చిన్న కథ : ఒక వ్యక్తికి అనారోగ్యం సంభవించింది. దీనికి మూల కారణం అజీర్ణ మని డాక్టర్ నిర్ణయించాడు. ఎన్ని మందులు వాడిననూ నయం కాలేదు. అప్పుడు ఒక మహనీయుడు కనిపించి “నాయనా! నీ అజీర్ణవ్యాధి కి నేను ఒక మందు చెప్తాను. అది ఏమనగా ఉప్పు రాళ్లను నిరంతరం నీవు జేబులో వేసుకుని ఉండు. ఒకటి అవుతూనే మరొకటి నోట్లో వేసుకుని ఉప్పు రసం

మింగుతూ ఉండు. ఈ అజీర్ణవ్యాధి తగ్గిపోతుంది" అని సలహా ఇచ్చాడు. ఆ వ్యక్తి అలా చేయటం వలన అతని వ్యాధి తగ్గుముఖం పట్టింది. దీపావళి పండగ వచ్చింది. ఆ వ్యక్తి అందరికీ లడ్డూలు పంచాలని అంగడి కి వెళ్లాడు. లడ్డు రుచి చూసే నిమిత్తమై కొంత నోట్లో వేసుకోవడం, బాగాలేదని వెనక్కు రావటం, ఈ విధంగా అనేక అంగళ్ళు తిరిగాడు. ఒక వ్యక్తి ఇతనిని చూసి "అయ్యా! మొదట మీరు కుళాయి వద్దకు వెళ్లి, నోరు బాగా కడుక్కొని రండి" అన్నాడు. అప్పుడు నోటిలో ఉప్పు ఉన్నదని గుర్తుకు వచ్చి, కుళాయి వద్దకు వెళ్లి నోరు కడుక్కుని లడ్డు తిని "తీయగా ఉన్నది' అని చెప్పాడు. దీనినిబట్టి తెలుసుకోవలసినది ఏమనగా "లోక సంబంధమైన విషయ వాసనలను మనసులో పెట్టుకుని ఏ సత్సంగమునకు వెళ్లినా ప్రయోజనం ఉండదు."అని.

" యద్భావం తద్భవతి" అంటారు. ఏ కలరు కంటి అద్దాలు కండ్లకు పెట్టుకుంటామో ఆ కలరే మన కళ్ళకి కనిపిస్తుంది. "ఎట్టి తిండో అట్టి త్రేన్పు"

అంటారు. కనక భగవంతుడు ఇచ్చిన ఈ శరీరము ను సత్సంగంలో ప్రవేశపెట్టి, జీవితమును సార్థకం చేసుకొనవలెను.

4.దీనజనుల కై దానము :

ఇందులో అందరికీ మార్గదర్శకమైన వారు మన స్వామి. స్వామి చూపించే మార్గంలో అత్యంత ముఖ్యమైనది దీన జనోద్ధరణ సేవ. ఈ సేవలు మానవ జీవితాన్ని చరితార్థం చేస్తాయి. గృహస్తులు ఆర్జించిన ధనమును నిత్యజీవితానికై ఉపయోగించి కొంత భద్రపరిచి, మిగిలినది దీనజన సేవకై సద్వినియోగ పరచవలెను. ఈ సేవలో హృదయము నిర్మలమైనది గా, ప్రేమమయ మైనదిగా తీర్చిదిద్ది కొనుటకు అవకాశం ఉంటుంది. మానవసేవయే మాధవసేవ.

(ఈశ్వరమ్మ గారు స్వామి ని కోరిన మూడు కోరికలు వివరించ వలెను)

ఉదాహరణ: ఈశ్వరచంద్ర విద్యాసాగర్ -సమాజ సేవ :

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కలకత్తావాసి. అతను సార్థక నామధేయుడు. విద్యలో సాగరం వంటి వాడు. అతని తల్లి ఎన్నో కష్టములకోర్చి, విద్యాభ్యాసం పూర్తి చేయించి తీర్చిదిద్దింది. విద్య పూర్తి అయిన పిదప, అతను అను ఉన్నత పదవిలో ఉద్యోగమును పొందాడు. అప్పుడు అతని తల్లిని “అమ్మా!మీ శ్రమ, ఆశీస్సులు, ప్రేమ వలన నేను ఈరోజు ఉన్నత పదవిలో ఉన్నాను. నీకేమైనా కోరికలు ఉంటే నాకు చెప్పు తీరుస్తాను” అన్నాడు.

అప్పుడు తల్లి “ఇప్పుడు కాదు నాయనా, నాకు మూడు కోరికలు ఉన్నాయి. కొంతకాలం పోయిన తర్వాత అడుగుతాను” అన్నది. ఇంకా ఉన్నత పదవి పొందిన తర్వాత ఈశ్వరచంద్ర విద్యాసాగర్ తన తల్లిని కోరికలు అడగమన్నాడు. అప్పుడు ఆమె “నాయనా! మన గ్రామంలో పాఠశాల, వైద్యశాలను నిర్మించు” అని కోరారు. అనతి కాలంలో తల్లి కోరిక ప్రకారమే పాఠశాల వైద్యశాలను నిర్మించారు. ఆమె తన మూడవ కోరిక బాటసారులు, యాత్రికులు వారి గ్రామం

మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు, విశ్రాంతి తీసుకొనుటకు ఒక విశ్రాంతి భవనం నిర్మించాలని కోరారు. ఆయన ఒక విశ్రాంతి భవనం నిర్మించారు.

- ఈ ప్రకారం ప్రతి ఒక్కరు తాము విద్యనభ్యసించి, ఉన్నత పదవులను పొంది, దీన జన సేవ చేసినప్పుడే వారు చదివిన చదువుకు గుర్తింపు, సార్థకత లభిస్తాయి.

## దైనందిన జీవితంలో అన్వయించుకొనుట :

1.నామ స్మరణ వలన, నామి గా మారిపోవుట. ఉదాహరణకు భరతుడు నిరంతర రామనామ స్మరణ వల్ల శ్రీరాముడి రూపం కలిగియుండుట.

2.జీవితంలో సుఖదుఃఖాలు సమభావంతో చూడాలంటే సత్సంగం అవసరం.

3.పారాయణలు, ధ్యానము, సత్సంగము, వలన ఎన్నో బలహీనతలను దాటుకొన వచ్చును.

4. నీ ఇష్ట దైవ నామస్మరణ చేస్తూ, రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే-నీలో కలిగే ఆనందం ప్రాప్తి వలన ఎంతో శక్తి అభివృద్ధి అవుతుంది.

5.దీన జనులకు సేవ చేయడం ఒక యోగం. ఇదియే సులభ సాధనా మార్గము.ఇందులో ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రులు, అనాధ శరణాలయాలందు సేవ చేయడం మన కర్తవ్యం.

5. ఏమి చేసినప్పటికీ మీ ఆరాధ్య దైవం సర్వ జీవుల యందూ ఉన్నాడని గుర్తుంచుకోండి మానవత్వానికి సార్ధకత కలిగించుకుందాం

*****

5. అర్థమనర్థం భావయ నిత్యం , నాస్తి తతః సుఖలేశః సత్యం|
పుత్రాదపి ధన భాజాం భీతిః , సర్వ త్రైషా విహితా రీతిః||

➢ హరిగోవిందం –

ధనమే కీడను కొనరా నిత్యము ,లేదు దాన సుఖలేశము సత్యము|
కొడుకైనా భయపడురా ధనికుడు, నడిచేదిదే యెల్లడల నెప్పుడు||

**భావము : -** సర్వ అనర్థములకు ధనమే మూలకారణం. ధనము వలన సుఖం ఏ మాత్రం లభించదు. ధనము వలన మానవుడు అనేక వ్యసనములకు గురి అవుతాడు. మిత్రులు శత్రువులుగా మారుతారు. ధనం వలన తల్లి తండ్రీ కొడుకుల మధ్య కూడా విభేదాలు ఏర్పడతాయి. ఇది లోకం లో సర్వత్రా జరిగే రీతి.

**ముఖ్యాంశములు:-**

చతుర్విధ పురుషార్థములలో అర్థము ఒకటి. అర్థము అనగా ధనము.

మానవుని యొక్క జీవితము ధన, కనక, వస్తు, వాహనాలపై ఆధారపడలేదు. మానవుని యొక్క స్థితి వారి గుణముల పైననే ఆధారపడి ఉన్నది. మానవుని జీవితము ఐహిక, ఆముష్మిక మిశ్రమ స్వరూపం. కానీ మానవుడు ఐహికమును ఆశించి,

ఆముష్మికమును విస్మరించి జీవితమును నిరుపయోగం చేసుకుంటున్నాడు.

నాలుగు పురుషార్ధములు అయిన ధర్మ అర్ధ కామ మోక్షములలో ధర్మము అనునది పాదము. మోక్షము అనునది శిరస్సు. కానీ పాదములను, శిరస్సును త్రుంచి వేసి, అర్థ, కామములలో జీవించుచున్నాడు మానవుడు.

ధర్మార్థ ,కామ ,మోక్షములలో - ధర్మము అర్థము ఒకటిగా, కామము మోక్షము రెండవది గా విభజించుకుని, అర్థము ధర్మనిమిత్తముగా, కామము మోక్షనిమిత్తంగా ఉపయోగించిన మానవ జీవితము సార్థకమగును. అనగా ధర్మమును అర్థించి (కోరుకుని), మోక్షమును కామించి, మానవుడు దివ్యత్వం పొందుటకు ప్రయత్నించవలెను.

ఉదాహరణ : ఒక లోతైన గుంట పక్కన, ఎత్తైన గుట్ట వుండినచో , ఎత్తైన గుట్ట నుండి కొంత మట్టిని తీసి లోతైన గుంటలో వేసినచో , రెండు సరి సమానం అగును.

అలాగే ధనవంతుడు ఎత్తైన గుట్టవంటివాడు. పేదవాడు లోతైన గుంట వంటివాడు. ధనవంతుడు కొంత ధనమును పేదవాడికి ఇచ్చినచో ఇద్దరూ సమానం అగుదురు. అప్పుడే సమత్వము అను మానవత్వం అభివృద్ధి అగును. అందుకే ప్రాచీన కాలం నుండి దానము, ధర్మము అను పవిత్ర మార్గములను అనుసరిస్తున్నారు భారతీయులు.

భారతసౌధమనే భవనము భూమాత, వేదమాత, గోమాత, దేహమాత అని నాలుగు మాతలపై ఆధారపడి ఉన్నది. ఈ నాలుగు మాతలు భారత దేశము అనే సౌధమునకు నాలుగు పిల్లర్స్ వలే ఉంటున్నవి. వీటినే మనము సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ అని పిలుస్తున్నాము.

సత్యముతో మనం జగత్తును కాపాడుకోవాలి. ధర్మము తో మన వేదములను పునరుద్ధరింప చేయాలి. శాంతముతో మన గోమాతను కాపాడుకోవాలి. ప్రేమతో మన దేశమాతను ప్రేమించాలి.

ఈ నాలుగింటి యందు మన యొక్క దివ్యత్వం అనే మానవత్వాన్ని సార్ధకం కావించుకోవాలి.

మన భారత దేశము నకు సత్యము ధర్మము అనునవి రెండు నేత్రములు . ఈ నేత్రములతో భరత పుత్రులను కాపాడుతూ ఉన్నది. కనుక ఇట్టి పవిత్రమైన భారతదేశమును “ధర్మ, అర్ధ, కామ ,మోక్ష” మార్గములను సరియైన రీతిలో ఉపయోగించుకుంటూ, భారతదేశ ఖ్యాతిని పెంపొందింప చేయాలి.

ధనం వల్ల మానవుడు ఎన్నో ధర్మకార్యములు, పుణ్యకార్యములు చేయుచూ, ధనము సద్వినియోగ పరచుకొనవలెను. అందుకే ధనమును కాలి చెప్పు సైజు తో పోల్చారు. చెప్పు సైజు ఎంత కరెక్ట్ గా ఉండునో, సంపాదన అంత ధర్మబద్ధంగా ఉండాలి అని చెప్తా రు.

**Money comes and goes, but Morality comes and grows.**

మన దేశమున  ధనమును సద్వినియోగ పరచుకునే నిమిత్తమై ప్రతి వ్యక్తి కంకణం కట్టుకోవాలి. ధనమును, మట్టిని ఒకటిగా చూడాలి .

## ఉదాహరణకు : రామకృష్ణ పరమహంస కథ :

ఒకసారి స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంసను పరీక్షించదలచి అతని పరుపు కింద కొన్ని కాసులను ఉంచాడు. రామకృష్ణుల వారు, వచ్చి పడకపై పడుకుని వెంటనే వళ్ళంతా మంటలతో బాధ పడ్డారు. ఇది బంగారము, ఇది మట్టి అనే భేదం ఉన్నంతవరకు ఏకత్వం అనుభవించ లేము. ఈ రెండింటినీ ఏకత్వంగా చేసిన యెడల పవిత్రమైన ఆత్మకు శాంతి కలుగును.

- ధనము అవసరమే కానీ నిత్య జీవితమునకు అవసరమైనంత మాత్రమే పెట్టుకుని, మిగిలినది దాన ధర్మములు వినియోగించుకోవడం చాలా అవసరం.

## ఒక చిన్న కథ:- కర్మ-ఫలము :

ఒక గృహస్థుడు శనివారం నాడు తన ఇష్ట దేవత ఆరాధన చేయదలచి, తన కుమారుని పిలిచి “నాయనా! బజారుకువెళ్లి పది రూపాయలకు అరటిపళ్ళు తీసుకొనిరా!” అన్నాడు. ఆ పిల్లవాడు వయసులో చిన్నవాడైనా మంచి గుణవంతుడు. తెలివిగలవాడు.

పది రూపాయలు తీసుకొని బజారుకి బయలు దేరాడు. అరటి పళ్ళు కొని ఇంటికి తిరిగి వస్తూ అతను దారిలో ఒక తల్లి కొడుకులు ఆకలితో చాలా బాధ పడుతూ, అందరినీ దీనాతి దీనంగా ప్రాధేయపడటం చూశాడు. ఈ అబ్బాయి వారి దగ్గరికి వెళ్లి, ఆ తల్లి కొడుకుల కు తన చేతిలో ఉన్న అరటిపళ్లను ఇచ్చేశాడు. కొంత దూరంలో ఉన్న పంపు దగ్గరికి వెళ్లి నీటిని తెచ్చి, వారికి ఇచ్చి వారి దాహం తీర్చాడు. ఆకలి బాధ తీరిన ఆ తల్లీ కొడుకులు ఆనందభాష్పాలు రాలుస్తూ ఆ అబ్బాయికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ఆ అబ్బాయి ఇంటికి వెళ్ళగానే తండ్రి అతనితో "బాబూ! అరటి పళ్ళు తెచ్చావా? ఇలా తీసుకురా?" అన్నాడు.అప్పుడు ఆ పిల్లవాడు "నాన్నగారూ! నేను చాలా మంచి ఫలము తెచ్చాను. అది కంటికి కనబడదు" అని జరిగిన సంగతి తండ్రికి వివరించాడు. అది విన్న తండ్రి ఇటువంటి కొడుకు తనకు ఉండటం తన జన్మ ధన్యమైందని ఎంతో సంతోషించాడు ఆనాటినుండి తండ్రీకొడుకుల

మధ్య అనురాగం అధికమైంది. ఈ విధంగా ప్రతి ఒక్కరూ సత్ చింతలు అనే పుష్పాలను, సత్కర్మలు అనే ఫలాలను కలిగి ఉండాలి..

- ఈ కథ ద్వారా ధనముతో సత్కర్మలను ఎలా ఆచరించవలెనో తెలుసుకున్నారు

మన భారతదేశం ఒక త్యాగ భూమి, యోగ భూమి, ధర్మ భూమి. భారతీయుల అణువణువునా మాతృప్రేమ వ్యాపించి ఉంటుంది . తల్లీ కొడుకుల సంబంధాన్ని తెలియజేయు కథను తెలుసుకుందాము.

మాతృదేవోభవ : ప్రేమతో, త్యాగ భావంతో కనిపెంచిన తల్లిని సంతోషపెట్టడం, ఆమెను సేవించటం ప్రతి ఒక్కరి ప్రధాన కర్తవ్యం. బర్మా దేశంలోని రంగూన్ పట్టణం రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బాంబు దాడులకు గురి అయినది. ఆ పట్టణంలోని ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారు. అనేక కుటుంబాలలో తల్లి బిడ్డలు విడిపోయారు. భర్తకు దూరమైన ఒక ఇల్లాలు తన ఇద్దరు బిడ్డలతో

భారతదేశంలోని బరంపురం చేరుకుంది. ఆమెకు ఐదు, రెండు సంవత్సరముల వయస్సు గల కుమారులు ఉన్నారు. ఆమెతో పాటు చాలామంది కాందిశీకులుగా బరంపురం చేరుట చేత వారందరికీ తినటానికి తిండి దొరకడం కష్టమైంది. అప్పుడు ఈ ఇద్దరు బిడ్డల తల్లి వీధి వీధి తిరుగి భిక్షాటన చేసి, దొరికిన దాన్ని పిల్లలకు పెట్టి, తాను ఒక పూట తింటూ కాలం గడిపింది. రానురాను ఆ బిక్షం దొరకటం కూడా కష్టమైపోయింది. ఆమె చాలా బలహీనురాలయిపోయింది. క్షమెత్తటానికి కూడా ఆమెకు శక్తి లేక పోయింది. తల్లి పరిస్థితి గమనించిన ఐదు సంవత్సరాల వయసు గల కుమారుడు "అమ్మా! రేపటి నుండి నేను బిక్షాటన చేస్తాను. నీవు వెళ్ళవద్దు" అని బ్రతిమాలాడు. మరుసటి దినము నుండి ఆ పిల్లవాడు బిక్ష మెత్తి, దొరికిన దానిని తల్లికి తమ్ముడికి ఇచ్చి, తాను కొద్దిగా తిని, మంచి నీటితో కడుపునింపు కొనేవాడు. తల్లి అడిగితే "నేను తిన్నానమ్మా!" అనేవాడు. కొద్ది దినములకు పిల్లవాడు బలహీనుడయిపోయాడు. ఒకరోజు బిక్షం ఎత్తుతూ ఒక శ్రీమంతుని

ఇంటిముందు “భిక్షాందేహి” అని అరిచి కిందపడిపోయాడు. ఆ ఇంటి వాకిట్లో పేపర్ చదువుకుంటున్న ఇంటి యజమాని పరిగెత్తుకొని వచ్చి అబ్బాయి తలను ఒడిలో పెట్టుకుని “బాబూ! నేను నీకు కడుపునిండా అన్నం పెడతాను”. అన్నాడు. అబ్బాయి హీన స్వరంతో “అమ్మకు మొదట అన్నం పెట్టండి” అని చెప్పి ప్రాణాలు వదిలాడు. ఆ అబ్బాయి ఆఖరి క్షణంలో కూడా తల్లిని గురించే ఆలోచించాడు.

- “ధనార్జన కొరకై పాటు పడకుండా, పవిత్రమైన మార్గంలో ప్రవేశించి, మొదట మీ తల్లిదండ్రులను సంతృప్తి పరచండి.
- మీ బ్లడ్డు, మీ హెడ్డు, మీ ఫుడ్డు, మీ దుడ్డు మీ తల్లిదండ్రుల నుంచి వచ్చినవి.
- ‘ధన మూల మిదం జగత్' అని కాకుండా 'ధర్మ మూల మిదం జగత్' అనే విధంగా నడుచుకోవాలి.

- ధనము అవసరమే కానీ నిత్య జీవితమునకు అవసరమైనంత మాత్రమే పెట్టుకుని, మిగిలినది దాన ధర్మములు వినియోగించుకోవడం చాలా అవసరం.

ఈ శ్లోకం ద్వారా విద్యార్థులకు తెలియజేయవలసినవి :

1. “మాతృదేవోభవ! పితృదేవోభవ!”అన్నది ఆచరణలో పెట్టి భారతీయ సంస్కృతిని అభివృద్ధి చేయాలి.

2. ”యద్భావం తద్భవతి”. మనం చేసినవే మనకు ఫలితాన్ని అందిస్తాయి అని అర్థం.

ఈనాడు మనము మన తల్లిదండ్రులను సంతోష పెడితే రేపటి దినం వారు మనల్ని సంతోష పెట్టడానికి పూనుకుంటారు.

3. “విద్య యొక్క లక్ష్యం గుణార్జన, ధనార్జన కాదు” - బాబా

ఉదాహరణ - శ్రీ అబ్దుల్ కలాం , శ్రీ రతన్ టాటా .

4. Be good, See good, Do good, This is the way to God.

5. పాకెట్ మనీ కొరకు తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టకూడదు.

6. చిన్నతనం నుండి “కోరికలు నియంత్రణ” (Ceiling on desires) అలవాటు చేయాలి. ఇవి అభివృద్ధి పరుచుకోవాలి అంటే మంచి సత్సంగం ఉండాలి.

7. ధర్మ ధనమే మనకు జ్ఞాన ధనము అని తెలుసుకోవాలి.

8. సత్ చింతనలతో జ్ఞానాన్ని అభివృద్ధి పరుచుకోవడానికి,

“3W”ని అనుసరించాలి - Work, Worship, Wisdom.

ఇవి మానవుని ఉత్తమ స్థితికి తీసుకొని పోతాయి.

ఇంకొక ప్రత్యేకమైన 3 “W” ఉన్నాయి. అవి ఏమనగా: Wealth, Women,Wine . ఇవి మానవుని అధమస్థితికి తీసుకుని పోతాయి.

9. బ్లడ్డు, దుడ్డు ప్రవహిస్తూనే ఉండాలి.

10. Money can buy bed….but not sleep.

Money can buy medicine..but not Health.

Money can buy book…but not brain.

Money can buy cloth….but not beauty

Money can buy house…but not home.

Money can buy comforts..but not happiness.

Money can buy food... but not appetite.

Money can buy temple...but not God

అన్నది తెలియజేయాలి.

*****

6. ప్రాణాయామం ప్రత్యాహారం , నిత్యానిత్య వివేక విచారమ్|

జాప్య సమేత సమాధి విధానం , కుర్వవధానం మహాదవధాన||

- హరిగోవిందం -

ప్రాణాయామము,ప్రత్యాహారము,నిత్యానిత్య వివేక విచారము|

మంత్రముతోడ సమాధివిధానము, జాగ్రత్తగ నిశ్చలముగ యుము||

**భావము:** ఈ శ్లోకంలో ఆదిశంకరాచార్యులు అష్టాంగమార్గ యోగ సాధనను గురించి ప్రబోధించారు. జనన మరణము లేని స్థాయిని సంపాదించ వలెనన్న యోగశాస్త్రం ప్రకారం అష్టాంగ యోగము చేపట్టుట అవసరము.

అష్టాంగ యోగములు అనగా యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన సమాధులు.

ప్రాణాయామం ప్రత్యాహార జప సహిత ధ్యానము అనగా ధారణ, ధ్యానము, సమాధులను పేర్కొన్నారు శంకరుల వారు ఈ శ్లోకంలో.

**ముఖ్యాంశములు :**

సాధనలు రెండు రకములు.

1) బహిరంగ సాధన 2) ఆంతరంగిక సాధన

శ్రవణం, కీర్తనం, స్మరణం, అర్చనం, వందనం, పాదసేవనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం ఈ 9 బహిరంగ సాధనలు.

ప్రాణాయామము, ప్రత్యాహారము అంతరంగిక సాధనలు. ఇది అష్టాంగ యోగ సాధనల లోనివి.

## అష్టాంగ యోగ సాధనలు :

1. యమ -నిషేదించినవి.
2. నియమ -నిషేదించ వలసినవి
3. ఆసన -యోగ భంగిమలు
4. ప్రాణాయామ -ప్రాణశక్తి పర్యవేక్షణ
5. ప్రత్యాహారం -ఇంద్రియముల ఆహారం
6. ధారణ -బుద్ధిని కేంద్రీకరించటం
7. ధ్యాన -వికేంద్రీకరణ
8. సమాధి -బాహ్య విషయ వైముఖ్యత.

## ➢ ప్రాణాయామం :

1. ప్రాణమును నిరోధించడమే(అదుపులో ఉంచడమే) ప్రాణాయామం యొక్క సాధన. లోపలికి వెళ్లి, బయటికి వచ్చే ప్రాణవాయువును నియంత్రించటం.

2. ప్రాణము అనగా జీవనము, ఆయామము అనగా పొడిగించుట.

3. మానవుని యందు ఐదు ప్రాణములున్నవి.

అవి : ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము.

4. ఈ ఐదు ప్రాణములు నిరోధింప చేసి తద్వారా అనేక రకముల అంతర్దృష్టి అభివృద్ధి పరుచుకునేటువంటి ప్రయత్నానికి పూనుకోవటం ప్రాణాయామం యొక్క విశిష్టత.

5. ఈ ప్రాణాయామము నందు రేచక, పూరక, కుంభక మని మూడు రకములు ఉంటున్నవి.

6. ప్రాణ గతిని అపాన గతిలో, అపానగతిని ప్రాణ గతిలో, ప్రాణ అపాన గతులు రెండింటి యందు కుంభకం చేసే పరిస్థితే ప్రాణాయామము.

## ➢ ప్రత్యాహారం :

1. ప్రత్యాహారం అనగా బహిర్ముఖంగా ఉన్న ఇంద్రియముల భావములను అంతర్ముఖంగా చేసే ప్రయత్నము.

2. మనస్సు యొక్క కిరణములు ప్రాకృత దృశ్యములపై ప్రసరించుట చేత మనస్సు మాలిన్యం చెంది, కేవలం ప్రాపంచిక సంబంధమైన విషయములయందు ఇష్టము పెంచుకుని బంధింపబడుచున్నవి.
3. అందుచే ఈ మానసిక కిరణములను మనస్సు వైపు మరణించే ప్రయత్నమే ప్రత్యాహారము యొక్క అర్థము.
4. ప్రాణాయామం లేని ప్రత్యాహారము, ప్రత్యాహారం లేని ప్రాణాయామము చేయుటకు వీలు కాదు. ఈ రెండూ కూడనూ జంటల వంటివి. బింబ ప్రతిబింబముల వంటివి.
5. యేదో ఒకటి చేసిన యెడల దాని ఫలసిద్ధి మనకు దక్కదు.
6. మనసును అరి కట్టినప్పుడే ప్రాణము వశము అవుతుంది.
7. ప్రాణము అరికట్టినప్పుడే మనస్సు వశం అవుతుంది.
8. మనస్సు, ప్రాణము రెండింటి యందు దేహము చైతన్య స్వరూపంగా నిలిచి ఉంటున్నది.

9. కనుక ఈ దేహ చైతన్యమును మనము స్తంభింపచేసే నిమిత్తమై మనసును అంతర్ముఖముగను, ప్రాణమును నిరోధించే ప్రాణాయామముగను రెండు విధముల ఆచరించినప్పుడే సమాధి సిద్ధి అనునది మనకు ప్రాప్తిస్తుంది.

➢ **నిత్యా నిత్యా వివేక విచారం**:-

1.ఇందులో నిత్యానిత్య విషయ పరిశీలన ముఖ్యమైనది.

2.నిత్యానిత్య పరిశీలన చేసినప్పుడు ఆత్మ సత్యమని, దేహం అసత్యమని తెలుస్తూ వస్తుంది.

3.ఆత్మ విచారణ చక్కగా సలిపినప్పుడు ఈ ఆత్మకు కు "సత్యం శివం సుందరం" అనే సార్ధకమైన నామములు కూడా ఉన్నవి.

4. సత్యం లేని శివము, శివము లేని సుందరము ఉండటానికి వీలు లేదు.

5. సత్యం యొక్క ప్రకాశమే శివము. శివం యొక్క విలాసమే సుందరము.

6. సత్యము ప్రకాశం వంటిది. ప్రకాశం ద్వారానే ప్రకృతిని మనం చూడగలుగు తున్నాము. 7. ఈ చూపించే ప్రకాశమును, చూడగలిగే వస్తువును రెండింటి యొక్క తత్వమును అర్థం చేసుకునే విషయమే విలాసమైన సుందరం

8. కనుక సత్యం శివం సుందరముల మిళితమైన స్వరూపమే ఆత్మ.

9. ఈ మూడింటి యొక్క తత్వాన్ని అర్థం చేసుకుని గుర్తించిన తర్వాత మనము

ఇంకా చేయవలసిన సాధనలు ఏ మాత్రం ఉండవు. (వంట అయిన తర్వాత కట్టెలతో కానీ, నిప్పుతో కానీ మనకు ఏమాత్రం అవసరం ఉండదు).

**ఒక చిన్న కథ:- సోక్రటీసు ఆదర్శం:** సోక్రటీసు పాశ్చాత్య తత్వవేత్త. ఎప్పుడూ "నేనెవరు? నేనెవరు?" అని విచారణ చేస్తుండేవాడు. ఒక రోజు అతను అదే విచారణ చేస్తూ నడుస్తున్నాడు .ఎదురుగా ఒక అధికారి చేతి కర్ర ఊపుకుంటూ వస్తున్నాడు. కొద్దికాలం క్రితమే తన ఉద్యోగం నుంచి విశ్రాంత విరమణను తీసుకున్నాడు. సోక్రటీసు

తత్వ విచారణ చేస్తూంటే, ఆ అధికారి సంసారాన్ని గురించి విచారణ చేస్తున్నాడు. ఇద్దరూ పరధ్యానంగా నడుస్తూ ఒకరినొకరు ఢీకొన్నారు. ఆ అధికారి కోపంగా "నీవు ఎవరు ?" అన్నాడు సోక్రటీసు ఎంతో వినయంగా, శాంతంగా "అదే నాకు తెలియటం లేదండి, దయచేసి చెప్పండి నాకు, నేనెవరో" అన్నాడు. ఆ అధికారికి సోక్రటీస్ మాటలు అర్థం కాలేదు. అతనివంక వింతగా చూస్తూ మాట్లాడకుండా ముందుకు వెళ్ళాడు. సోక్రటీసు ఇంటికి వచ్చిఈజీ చైర్ లో కూర్చుని మరల "నేనెవరు ?" అనే విచారణ లో మునిగిపోయాడు. అతడు రావడం చూసి అతని భార్య భోజనం వడ్డించి పిలిచింది. కానీ అతనికి ఆ పిలుపు వినపడలేదు. ఒక గంట సేపు కాచుకుని కూర్చుంది. అయినను ఆయన ఆ విచారణ లోనే ఉండిపోయారు. నిత్యానిత్య పరిశీలన చేసి "బ్రహ్మసత్యం జగత్ మిథ్య" అన్నది తెలుసుకున్నాడు. స్వామి చెప్తారు

**You are not one person, but Three**
**The one you think you Are**
**The one others think you Are**
**The one you Really Are**

## ➢ జాప్య సమేత సమాధి విధానం :

1. ఇది "మనము సమాధి స్థితికి చేరుకొనుటకు కొన్ని రకములైన మార్గములు అవలంబించవలసి ఉంది" అని తెలుపుతుంది.
2. "జాప్యసమేత సమాధి విధానం" అనగా జపసహితమైన సమాధి.
3. జపము అనగా ఒక మాలను చేతియందు ఉంచుకుని, ఆ మాల యందలి మణులను తిప్పటం మాత్రమే కాదు.
4. నిరంతరము భగవన్నామము ( నాలుకతో కాకపోయినా మనసుతో) ఉచ్చరించటటమే జపం.
5. ఈ జపము క్రమేపీ భజన గా మారిపోతుంది.
6. జప-భజ ఈ రెండింటికీ భేదం ఏ మాత్రము లేదు.
7. నీవు మానసికంగా అంతర్ముఖం అయినప్పుడు, ఆ అంతర్ముఖం అయిన మనస్సును నిరంతరం భజించుచుండడమే జప సహితమైన సమాధి.

8. సమాధి అనగా సమ – ధీ ( సమబుద్ధి)

9. సమాధి అనగా కేవలం Unconscious గా ఉండు స్థితి సమాధి కానేరదు.

10. Subconscious లేదా Superconscious లో ఉండే పరిస్థితి సమాధి అనిపించుకోదు.

11. సమాధి - సమబుద్ధి లో ఉండే స్థితి. సహజమైన స్థితిలో ఉండి ఈ సమాధి యొక్క ఆనందమును అనుభవించుట.

12. ఈ స్థితిలో మనస్సు అంతర్ముఖమై ఆత్మ దృష్టి యందే ఉండి,సర్వమును చూస్తూ వున్ననూ , ఏమాత్రము సంబంధం లేని స్థితిలో ఉండును.

13. సుఖదుఃఖములకు, కష్టనష్టాలకు, శీతోష్ణా లకు అతీతమైన స్థితిలో ఉండును.

14. వ్యక్తిగా ప్రపంచంలో సంచరిస్తున్నప్పటికీ, సమాజము తో సంబంధం కలిగియున్నట్టుగా మనకు తోచిన అప్పటికీ, ఆ

వ్యక్తి యొక్క మనస్తత్వం  వ్యక్తికి గాని, సంఘమునకు కానీ, ప్రపంచమున కానీ ఎట్టి సంబంధము లేనట్టుగా ఉండును.

15. దీనిని స్వామి పద్యసూక్తి ద్వారా ఈ విధంగా చెప్పారు.

"కంటి గ్రుడ్డుకు కాటుక యంటనట్లు
జిడ్డునే మాత్రము నంటక జిహ్వ యుండు|
బురద నంటక తామర పువ్వులుండు
ఏది నంటక యుండు నదియే నాత్మ"|| --బాబా

ఈ కమలము వంటిది, కాటుక కన్నుల వంటిది, నాలుక వంటిది సమాధి స్థితి.

- కుర్వవధానం మహదవధానం :

అనగా తొందరపడక ఓపికతో, నిశ్చలమైన భావంతో, ప్రశాంతమైన హృదయంతో విచారించు. అంతేకానీ తొందరపడి ప్రవేశించటానికి పూనుకోవద్దు.

ఉదాహరణకు ఈనాడు ఒక మొక్కను నాటు తున్నాము. మొక్కను నాటిన తక్షణమే ఫలమును మనకు అందించదు. ఈ మొక్క వృక్షం

కావటానికి కొంతకాలం తీసుకుంటుంది. ఆ తర్వాతనే మనకు ఫలాన్ని అందిస్తుంది. పైరు నాటిన తక్షణమే ధాన్యము ఇంటికి తెచ్చుకోవడానికి వీలు కాదు . పైరు ధాన్యం గా మారటానికి కొంతకాలం తీసుకుంటుంది.

ఈ నాటి సాధకులు మొక్క నాటిన తక్షణమే ఫలము కావాలని ఆశిస్తున్నారు. పైరు నాటిన తక్షణమే పంట కావాలని ఆశిస్తున్నారు. ఇట్టి తొందరపాటుకు అవకాశం ఇవ్వక శాంత ముతో, ఓపికతో, సహనంతో, ప్రసన్న హృదయముతో కాచుకుని ఉండండి అన్నదే

మట్టి నుండి వచ్చిన చెట్టు మట్టియే కానీ చెట్టు కాదు. అలాగే బ్రహ్మ నుండి పుట్టిన ప్రకృతి బ్రహ్మయే కానీ ప్రకృతి కాదు. మనకు గోచరించే ప్రకృతి అంతా బ్రహ్మ స్వరూపమే అన్న సత్యాన్ని గుర్తించడానికి" గ్రహణసిద్ధి, లక్ష్యము" రెండూ అవసరము.

## చిన్న కథ : లక్ష్యం పై మాత్రమే దృష్టి (ఏకాగ్రత)

మహాభారతంలో ద్రోణాచార్యుడు పాండవులకు విలువిద్య నేర్పించు చూ, వృక్షమునకు పక్షిని కట్టి ఈ పాండవులను ఒకరి తర్వాత

ఒకరిని పిలిచి పక్షిని కొట్టడానికి ఇచ్చాడు. అప్పుడు ఒక్కొక్కరూ ఆ ప్రదేశమునకు వచ్చి తాము కొట్టు టకు సిద్ధంగా ఉన్నప్పుడు ఆచార్యుడు వారిని కొన్ని ప్రశ్నలు వేశారు.

భీమా! నీకు ఏమి కనిపిస్తుంది అని ప్రశ్నించాడు. భీముడు" గురుదేవా! వృక్షము కనిపించు చున్నది, పక్షి కనిపించుచున్నది. పక్షికి కట్టిన తాడు కనిపించుచున్నది. దాని వెనుక ఆకాశం కనిపించుచున్నది"అని పలికాడు.సరే, నీకు ఇన్ని కనిపించినప్పుడు నీ దృష్టిని ఏకాగ్రత పరచుకో లేవు. పక్కన కూర్చో అన్నాడు.

అలాగే అన్నదమ్ముల అందరిని పిలిచాడు. వారందరికీ ఇలాగే ప్రశ్నించాడు. అందరూ భీముడు చెప్పిన విధంగానే సమాధానం ఇచ్చారు.

అర్జునుడి వంతు వచ్చినది." అర్జునా! నీకేం కనిపిస్తున్నది అనగా" నాకు ఒక పక్షి తప్ప ఏమీ కనిపించడం లేదు" అన్నాడు. కనుక విద్య నేర్చుకోవాలి అంటే లక్ష్యం పైన నీ దృష్టి ఉండాలి. ఈనాడు

నేర్చుకోవాలి అనుకునేది ఒకటి, లక్ష్యములు అనేకములు. దీనివలన పొందవలసినది పొందలేక పోతున్నాము.చేరవలసినది చేరలేక పోతున్నాము.

అర్జునుడి వంటి లక్ష్యము మనము ఏర్పరుచుకోవాలి

గుణ దోషములను బట్టియే మంచి చెడ్డలు:- ఒకానొక సమయమందు శ్రీకృష్ణుడు దుర్యోధనుని పరీక్షింప గోరి "దుర్యోధనా! నేను ఒక కార్యమును చేయబోతున్నాను. దానికి నాకు ఒక గుణవంతుడైన వ్యక్తిని వెతికి తీసుకుని రా" అన్నాడు. దుర్యోధనుడు వెళ్లి అంతటా వెతికి శ్రీకృష్ణుని వద్దకు వచ్చి "స్వామీ! జగత్తులో గుణవంతుడైన వాడు ఎవరూ కనిపించలేదు. అందరిలో నాకు ఏదో ఒక దోషములు కనపడుతున్నాయి. నీవు గుణవంతుడు కావాలని కోరుకుంటున్నారు కనుక, ఉన్నవారిలో గుణవంతుడిని నేనొక్కడినే" అన్నాడు.

తర్వాత ధర్మరాజును పిలిచి "నాకు ఒక చెడ్డవాడైన వ్యక్తి కావలెను. వానిని వెదికి తీసుకుని రమ్ము" అని ఆదేశించెను. ధర్మరాజు అంతా

గాలించి "కృష్ణా! ఎంత వెదికిన ను నాకు చెడ్డ వారైనా వ్యక్తి కనబడలేదు. అందరియందు ఉత్తమమైన గుణమే కనిపించుచున్నవి. ఏదైనా చెడ్డ గుణములు ఉన్న వాడు అంటే నేను ఒక్కడిని మాత్రమే" అని పలికాడు. దుర్యోధనుడికి మంచివారు లేరు అని చెప్పడానికి, ధర్మరాజుకు చెడ్డ వారు లేరు అని చెప్పడానికి లోకం ఆధారము కాదు. వారికి ఉన్న గుణ దోషములు ఆధారం.

కనక మన గుణములను పరిశుద్ధ భావముతో అభివృద్ధి పరుచుకుని, ఆధ్యాత్మిక మార్గమందు ప్రవేశించి గుణములలోఉన్న దోషములను పరిహారం చేసుకోవాలని స్వామి ఆశిస్తున్నారు.

## దైనందిన జీవితంలో అన్వయించుకొనుట :

1. నేటి కాలుష్య వాతావరణంలో ఆరోగ్యంగా జీవించుటకు "యోగాభ్యాసం" అత్యవసరం. ఎందుకనగా కొన్ని జబ్బులు మందులకు తగ్గవు.

2. ఆసనములు శక్తిని పొదుపు చేసి, దానిని సూక్ష్మ రూపములైన మానసిక శక్తులుగా మార్చుటకు ఉపయోగపడును.
3. అంతః ప్రజ్ఞను పెంపొందించి మనశ్శాంతిని కలుగజేయును.
4. ఆసనములు ఏకాగ్రతను పెంచును.
5. ప్రతినిత్యము ప్రాణాయామం చేయుట అవసరము.
6. నోటితో తీసుకునే ఆహారం కన్నా ఇంద్రియాలతో స్వీకరించు ఆహారం (ప్రత్యాహారం) మన మనసుపై ప్రభావం చూపించును.
7. ప్రత్యాహారం లో దేనిపై దృష్టి ని కేంద్రీక రిస్తామో దానిని జపసహితంగా మననం చేయుట ధారణ.
8. ధారణ వలన చిత్త ఏకాగ్రత కలుగుతుంది
9. ధ్యానం వలన మనసు ఆత్మతో లీనం అవుతుంది
10. ధ్యానం తర్వాత స్థితి సమాధి స్థితి.
11. ఎక్కడ తిరిగినా, ఏమి చేసినా నిశ్చలంగా శాంతంగా ఉండు స్థితి సమాధి స్థితి.

12. ఏది సత్యమో ఏది అసత్యమో (నిత్య నిత్య వివేక విచారం) విచారించుట అవసరం

13. అనిత్యమైన, అశాశ్వతమైన శరీరము ద్వారా నిత్యమైన, సత్యమైన , ఆత్మను దర్శించగలరు.

14. ఏ సమయంలో ఏ పని చేయాలి అన్నది విచారణ చేసుకోవాలి. ఉదాహరణకు పరీక్షల సమయం లో క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఆ సమయంలో మనకు ఏది అవసరమో విచారణ చేసుకోవాలి.

15. శారీరక సంబంధములన్నీ అశాశ్వతములే. కనక చిన్న చిన్న సమస్యలు, అననుకూల పరిస్థితులు వచ్చినప్పుడు ఆత్మ విశ్వాసం లో ఉండాలి. అవి అన్నీ కదిలిపోయే మేఘాలు అని తెలుసుకోవాలి.

*****

7. కామం క్రోధం లోభం మోహం, త్యక్త్వాత్మానం భావయ కోహం|

ఆత్మజ్ఞాన విహీనా మూఢాః , స్తే పచ్యంతే నరక నిగూఢాః||

➢ హరిగోవిందం -

కామము క్రోధము లోభము మోహము,
విడువుము నేనెవ్వడ యనుకో|
తము తామెరుగని దద్దమ్మలకగు,
నరకములోపల నానా బాధలు||

భావము : కోరిక, కోపము, లోభము, భ్రాంతి ఈ నాలుగింటిని వదిలివేయాలి. తరువాత "నేనెవరిని ?" అని ప్రశ్నించుకోవాలి. అప్పుడే 'నేను' అను పరమార్థం దర్శించనగును.

ఇది శంకరాచార్యుల వారి ద్వాదశ మంజరిలో ఇది ఆఖరి శ్లోకము.

లోకంలో వైరాగ్యము అనునది ప్రధానమైన జ్ఞాననేత్రం తెరచుటకు అత్యవసరమైన మార్గమని శంకరుల వారు తెలుపుతున్నారు. మానవుని యొక్క హృదయము నందు జ్ఞానం అనే మణులు అపహరించే నిమిత్తమై, కామ క్రోధ, లోభ, మోహమనే గుణములు ప్రయత్నించుచున్నవి. వీరందరికీ కామము అనే గుణము

నాయకుడుగా నిలిచి ఉన్నది. మిగిలిన మూడు గుణములు దీనినే అనుసరించుచున్నవి. అసలు జన్మకు మూలకారణము కాముడు.

మరణమునకు కాలుడు. ఈ కాముడు ,రాముడు, కాలుడు ఈ ముగ్గురి యొక్క చేతల యందు మానవ జీవితం మెలుగుతున్నది. మధ్యలో ఉన్న రాముని యొక్క అనుగ్రహానికి పాత్రులు అయినప్పుడు రావణాసురుడి వంటి కాముడు మరియు  కాలుడు మన వద్దకు రావు. ఈ గుణములు నివురు కప్పిన నిప్పు వలె, పాచి కప్పిన జలం వలె, పొర కప్పిన కన్నువలె జ్ఞానమును కప్పివేసి  ఉండును.

- కామ గుణం  నిత్యానిత్య విషయ పరిశీలనను విచక్షణా శక్తిని నశింపచేసి మోహాన్ని అభివృద్ధి పరుస్తుంది.
- మోహం వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. దానివల్ల బుద్ధి క్షీణిస్తుంది. కనుక కామ గుణము మానవ జీవితానికి నాశనాన్ని చేకూరుస్తుంది.

కామ గుణమునకు రావణాసురుడు. క్రోధ గుణమునకు విశ్వామిత్రుడు, హిరణ్య కశ్యపుడు, దుర్వాసుడు, జమదగ్ని, కార్తవీర్యార్జునుడు మొదలగువారు

లోభ గుణమునకు దుర్యోధనాదులు, మోహమునకు ద్రోణాచార్యుడు, ధృతరాష్ట్రుడు.

<u>ఒక చిన్న కథ:</u> ఒక గ్రామంలో వివాహం జరుగుతున్నది. పెండ్లి కుమారుని వారు తరలివచ్చారు. వారు ఒక ఇంటిలో ఉంటున్నారు. పెండ్లి కుమార్తె వైపు వారు ఒక ఇంటిలో ఉంటున్నారు. ఈ ఇరువురి మధ్య లో ఒక వ్యక్తి పెండ్లి కుమారుడి వైపు వారి తో "మీరు సకాలమునకు భోజనమునకు రావటం లేదు. దానివలన మేము మీ కొరకై కాచుకొన వలసి వస్తున్నది" అని అన్నాడు. పెండ్లి కుమారుడి వైపు వారు ఇతను పెండ్లి కుమార్తె కుటుంబమునకు పెద్దవాడు అని భావించారు. అతని పెళ్ళి కుమార్తె వైపు వారి వద్దకు వెళ్లి "మీరు మాకు సరైన గౌరవ మర్యాదలు అందించడం లేదు, మమ్మల్ని అలక్ష్యం చేస్తున్నారు" అన్నాడు. వారంతా కలిసి ఇతను

ఎవరు? ఇతను ఎవరు? అని విచారణ చేశారు. ఆ సమయంలో అతను ఎవరికీ చెప్పకుండా పరిగెత్తాడు.నిజంగా అతను ఆ ఇద్దరికీ సంబంధించిన వ్యక్తి కాదు. అదేవిధంగా ప్రవృత్తి, నివృత్తి ల మధ్య కామము అనేది బయలుదేరి అటువైపున ఇటువైపున చాలా అధికారం చాలాఇస్తుంది. ఈ రెండు తత్వములు 'విచారణ' అన్నది చేసిన యెడల కామము అనేది మటుమాయమవుతుంది. దీనికి ఒకే ఒక ఔషధం భగవత్కృప.

భగవంతునికి హృదయాన్ని అర్పితం చేసినచో ఈ కామక్రోధాదులు దరిచేరవు . దీనిని ప్రయత్నముతో సాధించవచ్చును.

<u>ఒక చిన్న కథ : అభ్యాసము:</u> ఒక గ్రామంలో ఒక వ్యక్తికి నిరంతరము నల్లమందు తినడం అలవాటు. దానిని మానటం అతనికి సాధ్యం కావడం లేదు. ఒకోసారి ఆ గ్రామానికి ఒక మహనీయుడు వచ్చాడు. ఆ వ్యక్తి ఆ మహనీయుని దగ్గరికి వెళ్లి తన దురలవాటును కొరకై ఉపాయమును అడిగాడు. అప్పుడు ఆ మహనీయుడు

“నాయనా!నిత్యము నీవు ఎంత ప్రమాణంలో నల్లమందు తింటున్నావు” అని అడిగాడు.

ఆ వ్యక్తి ఒక్కొక్క దినము ఒక్కొక్క విధంగా తింటాను అని చెప్పాడు. అప్పుడు ఆ మహనీయుడు ఒక సుద్ద ముక్క చూపించి “నాయనా! నీవు రోజు ఈ ప్రమాణం లో మాత్రమే తీసుకో” అని చెప్పాడు. అయితే ఒక షరతు నీవు ప్రతి రోజు ఈ సుద్దముక్కతో మూడు మార్లు ‘ఓం’ అని రాసి దానిని భద్రంగా పెట్టుకో. రోజు దీని ప్రమాణంలో నీవు తీసుకో” అని చెప్పాడు. అందుకు ఆ వ్యక్తి వదలమని చెప్పలేదు తినమని చెప్పాడు కదా అని చాలా సంతోషించాడు. ఈ విధంగా ప్రతిరోజు మూడు సార్లు' ఓం ‘రాయడం వల్ల శుద్ధ ముక్క ప్రమాణం తగ్గుతూ తగ్గుతూ వచ్చింది. చివరకు సుద్దముక్క దృశ్యమైపోయింది. అతని దుర్గుణము వీడిపోయింది.

- గుణములు తప్పించుకోవడానికి ప్రయత్నించాలి. కామ క్రోధ లోభ మోహ ములు అనే నలుగురు దొంగలను బయటికి తరమటానికి పూనుకోవాలి. మనలో జ్ఞానము అనేది

ధనము ఉన్నది. ఆ ధనాన్ని అపహరించుట కై వచ్చిన ఈ దొంగలను అందర్నీ తరమి ,“చిత్త చోరుడు” అయిన భగవంతున్ని మనలో చేర్చుకోవాలి. మానవుడి మధురమైన అహంకారమును హతమార్చిన వాడు కనుకనే భగవంతునికి ‘మధుసూధన’ అని పేరు వచ్చింది. ఈ గుణాలు పారద్రోలు వాడు భగవంతుడు ఒక్కడే అని విశ్వసించినప్పుడే మూఢమతి నుంచి ముక్తిమతిగా మారుతాము.

## దైనందిన జీవితంలో అన్వయించు కొనుట:

1. కామ క్రోధ లోభ మోహ ములను నియంత్రించుకోకపోతే, మనకు ఇతర జీవరాసులకు తేడా ఉండదు.
2. పెద్ద పడవ చిన్న రంధ్రం వలన ఎలా మునిగి పోతుందో, ఒక చిన్న బలహీనత మానవ జీవితాన్ని ముంచి వేస్తుంది.

3. “తము తాము మెరుగని వారము” అనగా నీ బలహీనతలను నీవు తెలుసుకోనివాడవని  అర్థం. కనుక మన బలహీనతలను ఎలా అధిగమించాలో తెలుసుకుని ప్రయత్నించాలి.
4. దంతములకు మధ్య ఎంతో నేర్పు కలిగి నాలుక సంచరించినట్లు గా మెలగాలి.
5. కాలు జారిన మరలింపగలరు గాని-అన్న పద్య సూక్తిని గుర్తుంచుకోవాలి.
6. కోపం వలన మానవుల సంబంధ బాంధవ్యాలు దెబ్బతింటాయి.
7. బుద్ధి అనునది యజమాని. బలహీనతలు అనునవి సేవకులు. యజమాని మాట సేవకులు వినాలి.
8. ఈ ప్రయత్నములకు మన ఇంట వెంట జంట ఉండి సహకరించు వాడు భగవంతుడు అని తెలుసుకోవాలి.
9. “మోహ క్షయమే మోక్షము” అన్నారు స్వామి.
10. Who am I ? నీవు ఈ కర్చీఫా...కాదు, ఈ టంబ్లరా కాదు మరి “నీవెవరో తెలుసుకో” అని స్వామి ఎప్పుడూ చెప్తుంటారు.

దానికై చేసే నిరంతర ప్రయత్నంలో స్వామి అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది.

*****

8\. గురుచరణాంబుజ నిర్భర భక్తః,

సంసారాదచిరాద్భవ ముక్తః।

సేంద్రియ మానస నియమా దేవం

ద్రక్ష్యసి నిజ హృదయస్థం దేవం||

## హరిగోవిందం -

- సద్గురు చరణాబ్జము పై భక్తే,

త్వరగా ముక్తికి తరళే మార్గము|

ఇంద్రియ మానస సాంద్రనియమమే,

హృదయస్థుని చూపించును దేవుని||

భావము :ఇంతవరకు తెలుసుకున్న సాధనలకు తోడుగా సాధకుడు గురు చరణముల యందు భక్తి ప్రపూర్ణుడు కావాలి. గురువు అనుగ్రహం వలన దేనినైనను సాధించవచ్చును. ఆధ్యాత్మికత విష్ణు కలిగించిన వాడు గురువే కనుక గురువు పట్ల అనన్యమైన భక్తి విశ్వాసములు ఉండాలి.

ముఖ్యాంశములు:

1. గురు చరణముల యందు నిశ్చల భక్తి- సంసారము నందు విరక్తి -ఇంద్రియ నిగ్రహము , మనస్సు వశము నందుంచుకొనుట -ఈ నాలుగు సాధించినచో హృదయము నందే దైవ సాక్షాత్కారం కలుగుతుంది.
2. గురువు అనుగ్రహం వలన దేనినైనా సాధించవచ్చు.
3. గురు: ఈ రెండక్షరాల యందు 'గు' అనగా అంధకారము,' రు' అనగా తన్నివారణమని అర్థము. అనగా అజ్ఞానము

అనే చీకటి జ్ఞానము అనే జ్యోతితో దూరంగా గావించవచ్చును.

4. "గు కారో గుణాతీతః -రు కారో రూప వర్జితః". గుణాతీతుడు, రూపవర్జితుడు భగవంతుడు ఒక్కడే. భగవంతుడే అసలైన గురువు.
5. గురుభక్తికి ఉదాహరణ: పద్మ పాదుడు, సత్యకాముడు, బాల అరుణి, వివేకానందుడు మొదలగువారు
6. పాండవులు జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మకు సర్వస్య శరణాగతి చెందటం వల్ల నిరంతరం భగవత్ కృపకు పాత్రులయ్యారు.
7. కనుక భగవంతుడి అసలైన గురువు.
8. "సర్వం విష్ణుమయం జగత్" అంటారు.

వచ్చే పోయే బొమ్మలన్నీ జగత్తు. స్క్రీన్ పరబ్రహ్మము. స్క్రీన్ లేకపోయినా బొమ్మలు కనపడవు. కనుక జగత్తు అనే బొమ్మలలో, బ్రహ్మమనే స్క్రీను లీనమై ఉండటం వలన "సర్వం బ్రహ్మ

మయం"అగును. కనుక అజ్ఞానం నుండి దూరం చేసి ఇ ప్రజ్ఞానం అందించుట దైవత్వము నకే సాధ్యము.

ఒక చిన్న కథ: ఒక గుహలోఒక గురువుగారు ఉంటున్నారు. ఒక సాధకుడు జ్ఞానసముపార్జన కై గురువు కొరకు వెతుకుతూ అడవిలో వెళ్తున్నాడు. అలా వెళ్తూ గురువుగారు ఉన్న గుహ దగ్గరికి వచ్చాడు. ఆగు హలో చిన్న వెలుగు కనిపించింది. అది చూసి ఆ సాధకుడు అనుకున్నాడు "ఇవి ఏదైనా క్రూరమృగము యొక్క కన్నులా ? లేక మహనీయులు నివసించే స్థానమా ?" అని, "మహనీయుల అయితే నా కోరిక తీరును. మృగం అయినచో రెండు కన్నులు ఉండవలెను కదా. ఒక వెలుగు మాత్రమే కనిపిస్తోంది". అంటూ గుహలోకి వెళ్ళాడు. ఇంతలో అక్కడ వెలుగుతున్న దీపం ఆరిపోయింది. చీకట్లో భయం కలిగింది. "ఓం నమఃశివాయ" అంటూ భగవన్నామం ఉచ్చరిస్తున్నాడు. అంతలో గురువు "నాయనా! ఎవరునీవు? అని అడిగాడు. అంతా సాధకుడు తమ పాద సేవకుని అంటూ గురువు పాదాలపై పడ్డాడు. ఆయన మహనీయుడు కనుక

అతని హృదయ వేదన కనుగొన్నాడు. “నీ పని తర్వాత ముందు ఆ దీపం ముట్టించి రా” అని అగ్గిపెట్టె చేతికి ఇచ్చాడు. సాధకుడు తడుముకుంటూ వెళ్లి అగ్గిపుల్లలు ఒకదానిపై ఒకటి గీచినా దీపం వెలగలేదు. అప్పుడు సాధకుడు గురువు వద్దకు వచ్చి “అయ్యా! అగ్గిపెట్ట ఖాళీ అయ్యింది. కానీ దీపం వెలగలేదు “ అన్నాడు. అప్పుడు గురువు “నాయనా! ఆ దీపం లో నూనే ఉందా ? లేక నీరు ఉందా ?” గుర్తించమన్నాడు. సాధకుడు ప్రమిదలో వేలుపెట్టి చూసి మీరు వలే ఉన్నది అన్నాడు. అంత గురువు నీరు తీసి, నూనె వేసి వెలిగించమన్నాడు. సాధకుడు నూనె పోసి వెలిగించాడు. అప్పుడు చిటపట అని శబ్దం వస్తోంది కానీ, దీపం వెలగలేదు. అప్పుడు గురువు “నాయనా! ఇంతకుముందు నీటిలో ఉండుట చేత ఆ వ్యక్తి లో నీరు చేరి ఉండవచ్చును. ఆ వత్తి తీసి, నీరు పిండి, ఎండలో పెట్టి తెచ్చి వెలిగించ మన్నాడు. సాధకుడు అట్లు చేయగా చక్కగా జ్యోతి వెలిగింది. అంత ఆ సాధకుడు “స్వామీ! నాకు జ్ఞానం ప్రసాదించండి” అని ప్రార్థించాడు. అంతట గురువు “నాయనా! ఇంతవరకు నీకు

బోధించినది అదే" అన్నాడు. అది ఏ రీతిగనో నాకు స్పష్టంగా వివరించండి" అని వేడుకున్నాడు. అప్పుడు గురువు గారు "హృదయమనే ప్రమిదలో జీవుడు అనే వత్తిని వేశావు. విషయ వాసనలు అనే జలము ఉండుట చేత జ్యోతి వెలుగు లేదు. విషయ వాసన అనే నీటిని తీసివేసి, భగవత్ అనుగ్రహము, భగవన్నామము అనే నూనె పోశావు. అయినా జ్యోతి వెలగలేదు. కారణం పూర్వ పు విషయ వాసనలు వాటి లో చేరి ఉన్నాయి. అప్పుడు వాటిని తీసివేసి, వైరాగ్యం అనే ఎండలో పెట్టి, తిరిగి భగవదనుగ్రహము, భగవన్నామము అనే నూనెలో ఉంచితివి కనుక జ్ఞానమనే జ్యోతివెలిగినది. కనుక జీవుడు అను వత్తి వేసి, విషయపు వాసన అను నీరు పిండి, భక్తిసార మనే నూనెపోసి జ్యోతిని వెలిగించాలి. పాత వాసనలు దూరంచేసి, పవిత్రమైన నా జీవితం గడపాలి" అని చెప్పాడు.

9. ఈ విషయాన్ని స్వామి తన 14వ యేట "మానస భజరే గురుచరణం, దుస్తర భవసాగర తరణం" అంటూ మనసులో

శ్రీ గురు చరణాలు భజించిన వారు, గురువు అనుగ్రహంతో, జ్ఞానాన్ని పొంది, భవసాగరమును దాటి సద్గురు కృపకు పాత్రులు అవుతారు.

**Discourses of Bhagawan Sri Sathya Sai Baba- 1973 Summer Showers**

| S.No | Bhaja Govindam Sloka | S.No of Divine Speech | Dated |
|---|---|---|---|
| 1 | 9. Punarapi Jananam | 25 | 13 May 1973 |
| 2 | 10. Twayee Mayee | 33 | 25th May |
| 3 | 11. Satrau Mitre | 8 | 5th June 1973 |
| 4 | 12. Gayem Gita | 18 | 24 May 1973 |
| 5 | 13. Ardhamanardham | 7 | 6th June |
| 6 | 14.Pranayamam Pratyahaaram | 32 | 7May 1973 |
| 7 | 15. Kaamam Krodham | 24 | 14th May 1973 |
| 8 | 16 Guru Charanam | 16 | 26th May |

*** జై సాయిరాం ***